

# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
19వ వసంతంలోకి ...
ఉత్తరాంధ్ర
విశాఖపట్నం, శ్రీకాకుళం
విజయనగరం
గురువారం 12-02-2026 పేజీలు: 13


# ఎయిర్‌పోర్టుకు దారేది?



- భోగాపురం ఎయిర్పోర్ట్ కు మాస్టర్ ప్లాన్ రోడ్లు పూర్తి చేయాలి
- ఫ్లై ఓవర్లు, రోడ్లు పూర్తిగా కాకపోవడంతో సమస్యలు
- విశాఖ నుంచి వందే భారత్ ట్రైన్ ల తో పాటు బుల్లెట్ ట్రైన్ కూడా నడపాలి
- రైల్వే ప్లాట్ ఫామ్ ల సంఖ్య కూడా పెంచాలి
- విశాఖ ఎయిర్ పోర్ట్ ను కూడా కొనసాగించాలి

6వ పేజీలో

# మురికివాడల అభివృద్ధే లక్ష్యం



- పైలట్ ప్రాజెక్టుగా మురికివాడల పునరాభివృద్ధి
- మీడియాతో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

2వ పేజీలో

# మహా శివరాత్రికి భారీ బందోబస్తు

- కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి తీరం వరకు పోలీస్ పహారా
- సిపి డాక్టర్ శంఖబ్రతబాగ్చి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు
- సముద్ర స్థానానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు
- జిల్లా యంత్రాంగం తో పాటు ప్రైవేటు సంస్థలు కూడా పూర్తి సహకారం



2 లో

# హత్యల కలకలం..!!

- ఆరిలోవలో దారుణ హత్య
- ఆనందపురం లో అనుమానాస్పద హత్య..?
- ఆరిలోవ హత్య ఘటన లో నగదు, నగలు చోరీ..!
- పట్టపగలే ఘాతుకం




6వ పేజీలో

# జిల్లాలో మంజూరు చేసిన పనులు వెంటనే పూర్తిచేయాలి

: జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



**అనకాపల్లి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** జిల్లాలో మంజూరుచేసిన అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరు కార్యాలయం

3వ పేజీలో

# ఐఎఫ్ఆర్-2026ను సమన్వయంతో విజయవంతం చేయాలి

- బీచ్ రోడ్డులో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సమగ్ర ఏర్పాట్లకు ఆదేశాలు

3వ పేజీలో



# మహాశివరాత్రికి భారీ బందోబస్తు

✪ సముద్ర స్నానానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ✪ కోస్టల్ బ్యాటరీ నుండి భీమిలి వరకు గట్టి నిఘా

(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)



శివరాత్రి పండుగ సందర్భంగా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు విశాఖ కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి బీచ్ వరకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 8న జాగారం 9న ఉదయం సముద్రపు స్నానాలు కావడంతో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. సముద్రపు స్నానాల కోసం భారీ ఎత్తున ప్రజలు విశాఖ తీర ప్రాంతానికి తరలివచ్చే అవకాశం ఉండడంతో నగర సిపి డాక్టర్ రవిశంకర్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో బీచ్ లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కువ జనాలు వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా వీరితోపాటు జేబు దొంగలు కూడా కలిసిపోయి తమ చేతి వాటాన్ని ప్రదర్శించే అవకాశం ఉంది. దీంతో పోలీసులు తీర ప్రాంతంలోని అన్నిచోట్ల అక్కడికక్కడ పోలీసులను ఏర్పాటు చేయనున్నారు. ఎక్కువగా కోస్టల్ బ్యాటరీ నుంచి ఆర్కే బీచ్ అలాగే పార్క్ హోటల్ బీచ్ తీరం వరకు జన సందడి ఎక్కువగా ఉంటుంది. జనాలు తెల్లవారు మూడు గంటల నుంచి సాయంత్రం మూడు నాలుగు గంటల వరకు బీచ్ తీరంలోనే గడుపుతారు. సుమారుగా లక్షకు పైగానే ప్రజలు సముద్ర స్నానానికి వచ్చే అవకాశం ఉంది. ఈసారి జరిగే శివ రాత్రి ఉత్సవాలలో భాగంగా పలు ఆలయ కమిటీలో నిర్వహించే కార్యక్రమాల సందర్భంగా కూడా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేవిధంగా పోలీసులు తగు చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని కొన్ని కీలక ప్రాంతాలపై దృష్టి సారించారు. పోలీసు నిఘాను మరింత పటిష్టం చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది శివరాత్రి సందర్భంగా సముద్ర స్నానానికి వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. పోలీసులు కూడా అదే స్థాయిలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి బీచ్ వరకు కూడా ఎక్కడికక్కడ పోలీసుల పహారా ఉంటుంది. అలాగే గజ ఈతగాళ్లు కూడా ఎక్కడకక్కడ ఉంటారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించి ఆ సమస్య పరిష్కరించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారు. జిల్లా యంత్రాంగం కూడా సముద్రపు స్నానాల సమయంలో వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా ముందుకు వచ్చి సముద్ర స్నానానికి వచ్చే భక్తులకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధమవుతున్నారు.

## ఆనందపురం పి.ఎస్. పరిధిలో వ్యక్తి అనుమానాస్పద మృతి



**ఆనందపురం, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండల కేంద్రంలోని స్మశానం సమీపంలో ఉన్న ఒక పందుల ఫారంలో బుధవారం ఉదయం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలోని కొండగూడెంకు చెందిన శివ (38) గత ఆరు నెలలుగా ఇక్కడ వాచ్‌మన్‌గా పనిచేస్తూ భార్యతో కలిసి నివసిస్తున్నాడు బుధవారం ఉదయం తన భర్త మృతి చెందాడని, అతని ఒంటిపై గాయాలు ఉన్నాయని భార్య సమాచారం ఇవ్వడంతో పోలీసులు రంగంలోకి దిగారు. సీఐ వాసునాయుడు, ఆనందపురం, మధురవాడ ఎస్.ఐ. ల బృందం లతో పాటు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించాయి. దీనిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గడ్డి మందు తాగి మహిళ మృతి



**ఆనందపురం, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** మండలంలోని నేళ్లేరు గ్రామంలో గడ్డి మందు తాగి ఓ మహిళ మృతి చెందిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పాండ్రంకి లీల (48) కుటుంబ సమస్యల నేపథ్యంలో తన కుమారుడితో ఫోన్‌లో మాట్లాడింది. ఆ సమయంలో మాటల తగాదా చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత ఆమె అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త పాండ్రంకి శ్రీనివాసరావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మురికివాడల అభివృద్ధే లక్ష్యం

➪ వెలంపేట, ఇందిరానగర్ మురికివాడల్లో జీ11 అపార్టుమెంట్లు ➪ స్వచ్ఛ సర్వేక్షన్‌లో టాప్-3 లక్ష్యం ➪ మహిళల కోసం వర్కింగ్ వుమెన్ హాస్టల్స్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** విశాఖను మురికివాడల రహితంగా చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. బుధవారం తన ఛాంబర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధే ధ్యేయంగా మురికివాడల్లో మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల విస్తరణ, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధనే లక్ష్యంగా జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోందని వెల్లడించారు. ఇందులో భాగంగా నగరంలోని మురికివాడల రూపురేఖలు మార్చేందుకు వెలంపేట, ఇందిరానగర్‌లను పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. వెలంపేటలో 59 సెంట్ల స్థలంలో రూ.23.17 కోట్లతో పీపీపీ పద్ధతిలో జీ11 అపార్ట్‌మెంట్లు నిర్మించనున్నట్లు వివరించారు. 8.85 కోట్లతో జీవీఎంసీ మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం వాటా రూ.1.5 లక్షలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం వాట రూ.లక్షగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దీని ద్వారా 177 మంది లబ్ధిదారులకు పక్కా ఇళ్లు అందజేస్తామన్నారు. మార్చిలో ప్రారంభం కానున్న ఈ పనులు 18 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. అలాగే శ్రీకన్యా థియేటర్ సమీపంలోని ఇందిరానగర్ కాలనీలో జీ6 తరహాలో 110 మంది లబ్ధిదారుల కోసం గృహ సముదాయాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు.



### - స్వచ్ఛ సర్వేక్షణ్‌లో టాప్-3 లక్ష్యం

గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తొమ్మిదో స్థానంలో నిలిచిన విశాఖను, ఈ ఏడాది మొదటి మూడు ర్యాంకుల్లో నిలిపేందుకు కసరత్తు చేస్తున్నట్లు కమిషనర్ చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణ, వ్యర్థాల సేకరణపై నిత్యం పర్యవేక్షణ ఉంటుందని, త్వరలోనే స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం నగరంలో పర్యటించనుందని పేర్కొన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం ఆర్కే బీచ్ నుంచి రుషికొండ వరకు 6 అత్యాధునిక సులాభ్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

### - మహిళల కోసం వర్కింగ్ వుమెన్ హాస్టల్స్

మహిళల భద్రత, వసతి కోసం గాజువాక, ముడసర్లోవ, మధురవాడల్లో రూ.26.12 కోట్లతో వర్కింగ్ వుమెన్ హాస్టల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మితమయ్యే ఈ హాస్టల్స్‌లో జీ4 తరహాలో 96 గదులు ఉంటాయన్నారు. సుమారు 248 మంది మహిళలకు అన్ని ఆధునిక వసతులతో రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన వివరించారు.

### - ఐఎఫ్ఆర్ పనులకు తుది మెరుగులు

ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కోసం రూ.18.5 కోట్లతో చేపట్టిన 119 పనుల్లో 90 శాతం పూర్తయ్యాయని కమిషనర్ వెల్లడించారు. బీచ్ రోడ్డు సుందరీకరణ, సెంట్రల్ మీడియన్ల పనులు త్వరితగతిన పూర్తి చేశామన్నారు. అలాగే భోగాపురం ఎయిర్‌పోర్టుకు వెళ్లే రహదారుల అభివృద్ధిలో భాగంగా వేపగుంట--పినగాడి, వేపగుంట--జుత్తాడ రోడ్డు పనులను రూ.25 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు.

### - జోన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..

8 జోన్లగా ఉన్న గ్రేటర్ విశాఖను 10 జోన్లగా విభజించడం జరిగిందని, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి జోన్లు, వార్డుల అభివృద్ధికి ఎప్పటికప్పుడు సమావేశమై తగు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జోన్లలో వీధిలైట్లు, వాటర్‌సప్లై, టిడ్కో ఇళ్లలు, పారిశుద్ధ్యం, మురుగు కాల్వల నిర్వహణ, యూజీడీ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు జోనల్ స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ తగు చర్యలు తీసుకుంటామన్నారు.

### - ట్రాఫిక్ నియంత్రణ - మల్టీ లెవల్ పార్కింగ్

నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ఆర్కే బీచ్, భీమిలి వై జంక్షన్, పి.ఎం. పాలెం వద్ద పీపీపీ పద్ధతిలో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 'ఆపరేషన్ 3.0' కింద సెల్లార్ల ఆక్రమణలు తొలగించి పార్కింగ్ సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఆదాయ సేకరణలో భాగంగా ఈ ఏడాది రూ.1200 కోట్ల లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

## మొక్కలకునీళ్లు పోస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొని కార్మికుడికి తీవ్ర గాయాలు



**ఆనందపురం, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలంలోని శొంఠ్యాం వద్ద విధులు నిర్వహిస్తున్న కార్మికుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం ఎస్సీ కాలనీకి చెందిన నిడిగట్లు పైడిరాజు (60) డీబీఎల్ కంపెనీలో లారీ కాంట్రాక్టర్ వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. ట్యాంకర్ నుంచి రహదారి మధ్యలో ఉన్న మొక్కలకు నీళ్లు పోస్తుండగా, ఉదయం సుమారు 11 గంటల సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో లారీ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో పైడిరాజుపై వాహనం దూసుకురావడంతో ఆయన కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు వెంటనే నూట ఎనిమిది అంబులెన్స్ సాయంతో పైడిరాజును విశాఖపట్నం కేజీహెచ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఆనందపురం సీఐ వాసనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు బాధ్యతను హెడ్ కానిస్టేబుల్ పార్థసారథికి అప్పగించారు.

# ఐఎఫ్ఆర్-2026ను సమన్వయంతో విజయవంతం చేయాలి



**విశాఖపట్టణం ప్రతినిధి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** విశాఖ వేదికగా జరగనున్న ఐఎఫ్ఆర్--2026, సిటీ పరేడ్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జీవీఎంసీ అధికారులతో కలిసి బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్, ప్రధాన వేదిక, వీఐపీల సిట్టింగ్, వారి వాహనాల రాకపోకలు, సాధారణ ప్రజలకు వసతులు, బారికేడింగ్, క్యూలైన్లు, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు, పార్కింగ్ వసతి, కంట్రోల్ రూమ్ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల సమన్వయంతో సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. జెట్టీ ప్రాంతంలో ఉన్న పడవలను తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు తరలించాలనీ, అలాగే ఫైర్ షో, డ్రోన్ షో నిర్వహణకు అవసరమైన అనుమతులు ముందుగానే తీసుకోవాలనీ సంబంధిత అధికారులకు సూచించారు. సమన్వయం కోసం అదనపు వైర్‌లెస్ కమ్యూనికేషన్ సెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా కార్యక్రమ ప్రాంగణంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, మెడికల్ క్యాంపులు, స్ట్రెచర్లతో కూడిన అంబులెన్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏపీఐఐసీ గ్రౌండ్ వద్ద అవసరమైన చర్యలు చేపట్టి, గ్రౌండ్ లెవెలింగ్, సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పొదలు తొలగించాలన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని స్పష్టంగా వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, లైవ్ స్ట్రీమింగ్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, సాధారణ ప్రజల కోసం 100 మొబైల్ టాయిలెట్లు, అలాగే పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైఎంసీఏ నుంచి కాళీమాత ఆలయం వరకు నిర్వహించనున్న కంటింజెంట్ కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, పాల్గొనే వారికి అదనపు వసతులు కల్పించాలని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం బీచ్ వైపు 1,000 మంది వీక్షించగలిగేలా సరిపడా ప్రత్యేక ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేసి, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ప్రశాంతంగా, క్రమబద్ధంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. నేవీ, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఇన్కమ్ టాక్స్ అధికారిపై సిబిఐ కేసు..!

★ ప్రాథమిక ఆధారాలతో కేసు నమోదు ★ పక్కా సమాచారంతో నిఘా ★ బయటపడిన అక్రమ లావాదేవీలు ★ ఈ కేసులో మరో ఇద్దరు అరెస్టు..!

(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)




ఇన్కమ్ టాక్స్ అధికారిపై సిబిఐ కేసు నమోదు అయింది.ఆ అధికారిపై పలు ఉపయోగాలు వచ్చిన నేపథ్యంలో అతనిపై సిబిఐ పూర్తిస్థాయిలో నిఘా పెట్టింది.పక్కా ఆధారాలతో అతనిపై ఈ కేసు నమోదు చేసింది.ఈ కేసులో మరో ఇద్దరిని కూడా సిబిఐ అరెస్టు చేసింది. ఇక వివరాల్లోకి వెళ్తే.. ఇన్కమ్ టాక్స్ లో ఐటి యూనిట్ 3 ఇన్వెస్టిగేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేస్తున్న అమృత కుమార్ పై పలు ఆరోపణలు ఉన్నాయి. అతనిపై అభియోగాలు వచ్చిన నేపథ్యంలో సిబిఐ పూర్తిస్థాయిలో నిఘా పెట్టింది. దర్యాప్తు కూడా కొనసాగించింది. ఈ క్రమంలో అతని అక్రమాలు బయటపడడం జరిగింది. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కొందరికి అనుకూలంగా వహించినట్లు తేలింది. దీంతో సదరు ఇన్కమ్ టాక్స్ అధికారిపై సిబిఐ ప్రాథమిక ఆధారాలతో కేసు నమోదు చేయడం జరిగింది. అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న వస్తున్న ఆరోపణల నేపథ్యంలో నిర్వహించిన విచారణలో ఇన్కమ్ టాక్స్ అధికారి అమృత కుమార్ నర్సీపట్నం కు చెందిన రత్నమాల ఎడ్యుకేషనల్ సొసైటీ నుంచి అక్రమ లావాదేవీలు జరిపినట్లు తేలింది. రెండు కోట్ల రూపాయలు సొసైటీ అధ్యక్షుడు రాజేష్ ఖాతాకు బదిలీ అయినట్లు సిబిఐ అధికారులు నిర్ధారించారు. ఐటిఆర్ ఫైలింగ్ లో లోపాలు గుర్తించి సవరణలు సూచించి ఇన్కమ్ టాక్స్ అధికారి వారికి సహకరించారని తేలింది. సదర భక్తులకు అనుకూలంగా వ్యవహరించేందుకు రూ. 20 లక్షలు డిమాండ్ చేసినట్లు సిబిఐ అధికారులు గుర్తించారు. అయితే చివరకు రూ. 14 లక్షలకు ఒప్పందం కుదిరినట్టు నిర్ధారణ అయింది. ఇన్కమ్ టాక్స్ అధికారికి లంచం ఇచ్చేందుకు బయలుదేరిన చార్టెడ్ అకౌంటెంట్ శరత్ కుమార్ తో పాటు నలంద స్కూల్ యజమాని, రత్నమాల ట్రస్ట్ అధ్యక్షుడు రాజేష్ లను సిబిఐ అరెస్టు చేసింది. ఇన్కమ్ టాక్స్ అధికారిపై ప్రాథమిక ఆధారాలతోనే ఈ కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తును చేపట్టింది. అక్రమ ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవలసిన ఇన్కమ్ టాక్స్ అధికారులు అటువంటి వ్యక్తులతో కుమ్మక్కై వారు కూడా అవినీతికి పాల్పడటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కంచె చేను మేసే విధంగా పరిస్థితి మారింది. చివరకు ఈ అవినీతి ఇన్కమ్ టాక్స్ అధికారి పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేసి రెడ్ హ్యాండెడ్ గా సిబిఐ అధికారులకు పట్టుబడటం జరిగింది.

# సిటీ ప్లానర్ మీనా కుమారి సరెండర్...




GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

From
Commissioner,
Greater Visakhapatnam
Municipal Corporation,
VISAKHAPATNAM.

To
The Principal Secretary to Govt.,
Municipal Administration &
Urban Development Govt. of A.P.
Amaravathi,
GUNTUR.

Respected Sir,

Sub:- GVMC – Establishment Wing – Smt. V. Meenakumari, working as Planner, GVMC Surrendered to Govt. – reg.

It is to bring to your notice, that Greater Visakhapatnam Municipal Corporation, ... in our State, is poised for significant growth and development. With a focus on ... IT sector, tourism, services, and industries, there is immense potential for progress ... city's development aligns with the Government's vision for 2047, offering vast opportunities for growth across various sectors.

In this connection, I would like to inform that to reach the above goals and ... planning towards vision 2047, the City Planning Wing has to play a major and significant ... The supervisory staff at Joint Director / City Planner level, who has to deal half of the ... area (5 Zones) in all aspects and critical role in getting all subjects assigned to them in ... the rule position as well as in public relations.

It is further informed that there are lot of issues like court cases, Road ... programmes, LRS, BPS, Public Grievances (PGRS), Master plan roads and ... intended with effective service delivery to the public, which have to be closely monitored ... Joint Director / City Planner duly assisting the Chief City Planner, on behalf ... Commissioner GVMC.

**విశాఖపట్నం, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం లో పనిచేస్తున్న సిటీ ప్లానర్ 2 వీ మీనా కుమారి నీ జీవీఎంసీ కమిషనర్ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సరెండర్ చేశారు. జాయింట్ డైరెక్టర్ హోదా కలిగిన ఒక మహిళ అధికారిని తొలిసారి కమిషనర్ ఇలా ప్రభుత్వానికి సరెండర్ చేయడం జీవీఎంసీలో సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. టౌన్ ప్లానింగ్ విభాగంలో నిత్యం జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఇప్పటికే పలువురు ప్లానింగ్ సెక్రటరీలను సోకాజ్ నోటీసులు, సస్పెండ్ లు చేసిన కమిషనర్ ఈసారి ఏకంగా సిటీ ప్లానర్ నే సరెండర్ చేయడం వెనక పెద్ద కథే నడిచిందని ప్రచారం సాగుతుంది. టౌన్ ప్లానింగ్ లో వర్గ పోరు ఓ పక్క ఉండగా, మరోపక్క నగరంలో పలువురు బిల్డర్లు , రాజకీయ నేతలు వారికి అనుకూలంగా ఆమె వ్యవహరించకపోవడంతో తరచూ కమిషనర్ కి ఫిర్యాదులు చేయడంతోనే ఈ సరెండర్ చేయడానికి కారణమని ప్రచారం సాగుతుంది. చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకర్ చేస్తున్న అక్రమాలకు అడ్డుగా ఉన్న మీనా కుమారిని తొలగించుకోవాలని కమిషనర్ కు మీనా కుమారి పై లేనిపోనివన్నీ చెప్పి ఆమెను సరెండర్ చేసేలా సిసిపి కుట్ర చేశారని పెద్ద ఎత్తున టౌన్ ప్లానింగ్ విభాగంలో ప్రచారం సాగుతుంది. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో సిసిపి ప్రభాకర్ అనుచర వర్గం రాజ్యం వెలుతుంది. ముక్కు సూటిగా వ్యవహరించే మీనా కుమారి జాయిన్ అయినప్పటి నుంచి అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్న సీసీపీ కమిషనర్ ద్వారా సరండ్రకు కుట్ర చేశారని ప్రచారం.

# జిల్లాలో మంజూరు చేసిన పనులు వెంటనే పూర్తిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నుండి మండల అభివృద్ధి అదికారులు, ఇంజనీరింగు అధికారులు, విద్యుత్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, క్రీడాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పనులు ప్రస్తుత పరిస్థిని సమీక్షించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరుచేసిన నిర్మాణ పనులన్నింటిని వెంటనే పూర్తిచేయాలని, నిధులు మురిగిపోయినట్లయిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి మండలానికి 5 గ్రామాలను ఒడిఎఫ్ ప్లస గ్రామాలుగా తీర్చిదిద్దాలని నిర్దేశం చేయడం జరగిందని, ఆ గ్రామాలలో సోక్ పిట్స్, మేజిక్ డ్రయిన్స్ తదితర నిర్మాణాలన్నింటిని పూర్తిచేయాలని తెలిపారు. పాఠశాలలలో, వసతిగృహాలలో జీరో వేస్ట్ మేనేజ్మెటు అమలు చేయాలని తెలిపారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే వెంటనే పూర్తిచేయాలన్నారు. జిల్లాలో వీధికుక్కలు సంతతి పెరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి మునిసిపాలిటీ, మండలంలో వీధి కుక్కలకు షెల్టర్లు ఏర్పాటుచేసి మార్చినాటికల్లా జిల్లాలో గల అన్ని వీధికుక్కలకు స్టెరిలైజేషను ప్రక్రియ పూర్తిచేయాలని తెలిపారు. జిల్లాలో 65శాతం గా గల అక్షరాస్యత శాతం పెంచుటకు అక్షర ఆంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలని, జిల్లాలో వయోజనవిద్య సెంటర్లకు వస్తున్న 91వేలమంది వచ్చేనెలలో జరిగే పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులయ్యేటట్లు వారికి చదువు చెప్పాలని తెలిపారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది వయోజనవిద్య సెంటర్లను సందర్శించి వారికి అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి ఎస్.సి.,ఎస్.టి. కుటుంబాలకు అందిస్తున్న ఉచిత సోలారు విద్యుత్ ఏర్పాటు పథకాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా పి.ఎం.సూర్యఘర్ పథకాన్ని ప్రతి విద్యుత్ వినియోగదారుడు వినియోగించుకొనేలా అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ అదికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లాపరిషత్ డిప్యూటీ సిఇఒ, డుమా,ఇంజనీరింగు, విద్యుత్ శాఖ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు. జారీః జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, అనకాపల్లి

# రైతుల హక్కులను కాలరాస్తారా

**- అనుభవంలో ఉన్న రైతుల భూములే కావాలా?**

**- జిఎంఆర్ సంస్థ పనులను అడ్డగించిన రైతులు**




**విశాఖపట్టణం , ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం రావ డం పుణ్యమా అంటూ అభివృద్ధి మాట దేవుడెరుగు గానీ, వందల సంవత్సరాల అనుభవంలో ఉన్న రైతుల భూములను లాక్కునేందుకు జిఎంఆర్ సంస్థ వేస్తున్న ఎత్తుగడలను రైతులు అడ్డుకున్నారు. బసవ పాలెం రెవిన్యూ పరిధిలో ఉన్న సుమారు 25 ఎకరాల రైతుల సాగులో ఉండే భూములను జెసిబి లు తీసుకొచ్చి చదును చేయడంపై స్థానిక నాయకులైన ఎంపీటీసీ ప్రతినిధి కోరాడ తాతారావు, రీసు రమణ కొందరు రైతులు అడ్డుకున్నారు. సుమారు 200 ఎకరాలకు పైగా రైతుల నుండి స్వాధీనం చేసుకున్న భూములకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదు సరి కదా, మిగిలి ఉన్న భూములను సైతం ఇలా దౌర్జన్యంగా తీసుకోవడంపై వారంతా మండిపడ్డారు. తమ భూముల మీదకి వస్తే పరిహారం ఇచ్చి స్వాధీనం చేసుకోవాలని వారంతా అన్నారు. దీంతో జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు అక్కడ నుంచి వెనుదిరిగారు.

**CHANGE OF NAME**

I, **KARRI ARUNA** (Old Name), D/o P. BALAKRISHNA RAO, Integrals Sunrise City Apartments, C-Block, Flat No: 308, Madhurawada, Visakha patnam. I have changed my name as **ARUNA PYLA** (New Name) Hereafter my name is known as **ARUNA PYLA** (New Name).




## కొణతాల రామకృష్ణ చొరవతో మార్టూరు రోడ్డుపనులు ప్రారంభం

**– 3 కోట్లు నిధులు కేటాయింపు**



**అనకాపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కృషితో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో మార్టూరు మాకవరం సిహెచ్ఎన్ అగ్రహారం మూడు గ్రామాలను కలుపుతూ ఉన్న మాటూరు జంక్షన్ నుండి సిహెచ్ఎన్ అగ్రహారం వరకు బిటి రోడ్డు పనులు బుధవారం ప్రారంభం అయ్యాయి. మొదటి విడతలో భాగంగా మూడు కోట్ల రూపాయల నిధులతో 700 మీటర్ల సిసి రోడ్డు 2.3 కిలోమీటర్ల బీటీ రోడ్డు నాలుగు కల్వర్టులు 120 మీటర్ల ఆర్టీ వాల్ పనులు చేపట్టనున్నారు. జరుగుతున్న పనులను అనకాపల్లి జనసేన పార్టీ మండల నాయకులు తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు మరియు గంగుపాం జగదీష్ సిహెచ్ఎన్ అగ్రహారం డి సి ఎం ఎస్ చైర్మన్ బంటు రవి మాకవరం సర్పంచ్ మోయ్య భవాని నూకరాజు మరియు మార్టూరు గ్రామ కూటమి నాయకులు పర్యవేక్షించారు .ఈ సందర్భంగా ఈ మూడు గ్రామాలకూటమి నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అడిగిన వెంటనే ఈ రోడ్డు పనులకు నిధులు కేటాయించి పనిని ప్రారంభించడం మాకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని హర్షం వ్యక్తం చేశారు .అదేవిధంగా ఇంత వేగంగా ఈ రోడ్డుపై దృష్టి సారించి నిధులు తీసుకువచ్చిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరిశెట్టి రామ్కికి కూటమి ప్రభుత్వ పెద్దలందరికీ కూడా ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

## చురుగ్గా సాగుతున్న కె ఆర్ పేట వంతెన నిర్మాణ పనులు



**దేవరాపల్లి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** ఎప్పుడెప్పుడని ఎదురుచూస్తున్న ఈ ప్రాంత ప్రజల కల నెరవేరబోతుంది. కుంగిన వంతెనతో కొన్ని నెలలుగా నరకయాతన అనుభవించిన ప్రయాణికులకు రాకపోకల సమస్య తీరనుంది. దేవరాపల్లి –కొత్తవలస ప్రధాన రహదారిలోని కృష్ణారాయుడు పేట జంక్షన్ వద్ద రైవాడ కాలువపై నిర్మిస్తున్న వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్య నారాయణమూర్తి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ పనుల్లో వంతెన నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. ప్రస్తుతం అప్రోచ్ రోడ్ల పనులు కొనసాగుతున్నాయి. వంతెన అందుబాటులోకి వస్తే విజయనగరం, అల్లూరి, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు రాకపోకలు సులభమవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## తహశీల్దార్లు సక్రమంగా విధులు నిర్వహించండి

**– ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చండి : జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్**



**అనకాపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** రెవిన్యూ శాఖ అంశాలకు సంబంధించిన పనులను సకాలంలో పూర్తిచేయాలని విధులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తహశీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరు కార్యాలయం నుండి తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స నిర్వహించి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ, పి.జి.ఆర్.ఎస్ మరియు రెవిన్యూ క్లినిక్, మ్యుటేషన్లు, రీసర్వే, రీసర్వే రీ వెరిఫికేషను, ఎం.ఎల్.సి.సి., బూత్ లెవల్ సమావేశాలు, ప్రభుత్వ భూములు పరిరక్షణ, ఇంటివద్దకే రేషను పంపిణీ, రేషను దుకాణాలు తనిఖీ, అనుమతులు మంజూరు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ ప్రతి సోమవారం పి.జి.ఆర్.ఎస్. మరియు రెవిన్యూ క్లినిక్ కార్యాక్రమాల ద్వారా వచ్చిన ధరఖాస్తులపై మరుసటిరోజునే క్షేత్ర స్థాయి సందర్శన నిర్వహించి, సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని, పరిష్కారం కాని సమస్య అయితే అర్జిదారునికి వెంటనే తెలియజేయాలని, ఎండార్స్‌మెంటు కాపీని అర్జీదారునికి అందించాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా అర్జీలు పరిష్కరించాలని, తగిన కారణం లేకుండా మ్యుటేషన్లు తిరస్కరించకూడదని, మ్యుటేషను ధరఖాస్తు సమయంలోనే అర్దీదారునికి కావలసిన సమాచారం అందించి, సరిగా ధరఖాస్తు చేయించాలని తెలిపారు. తహశీల్దార్లు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పని సరిగా చేయాలని, గ్రామాలలో గల ప్రభుత్వ భూముల పరిస్థితిని పరిశీలించాలని, అన్యాక్రాంతం కాకుండా వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శనివారం మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి మండల స్థాయి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎన్.ఒ.సి., సాల్వెన్స్ సర్టిఫికెట్స్, ఉద్యోగార్దులకు క్యారెక్టరు సర్టిఫికెట్, వివిధ లైసెన్స్ లు మంజూరు, తదితర దృవపత్రాలను వారం రోజులలోగా అందజేసేటట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సివిల్ సప్లయి కి సంబంధించి ఇంటివద్దకే రేషను సరుకులు పంపిణీ నిర్ణీత గడువులోపునే నూరుశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. తహశీల్దార్లు లక్ష్యం మేరకు రేషను డిపోలు తనిఖీలు నిర్వహించి రిపోర్టు పంపిచాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, సర్వే శాఖ సహాయ సంచాలకులు ఎస్. గోపాల్ రాజా, డిఎస్ఒ కె.వి.ఎల్.ఎన్.మూర్తి, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్‌లు, తహశీల్దార్లు హాజరయ్యారు.

## లేబర్ కోడ్స్ రద్దుకై 12న సమ్మెకి విస్తృత ప్రచారం

**: సిఐటియుఆర్ రాము కె సోమి నాయుడు**



**అచ్చుతాపురం, ఫిబ్రవరి 12, మేజర్‌న్యూస్:** ఉద్యోగులను, కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12 జరుగుతున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని అచ్చుతాపురం ఎస్ ఈ జెడ్, ముఠా, ఫార్మా, ఉపాధి శ్రామికులు కార్మికుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగింది. సందర్భంగా జరిగిన సమావేశాల్లో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము మండల కన్వీనర్ కే సోము నాయుడు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికులకు, ఉద్యోగులకు ఉరిత్రాళ్లు లాంటివని, వీటి నెట్టి పరిస్థితుల్లో అమలు చేయకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 8 గంటల పని విధానం తీసివేసి 12 గంటల పనిని ప్రవేశ పెట్టడం, కాలపరిమితి ప్రాతిపదికన కార్మికులు పనిచేయాలని, సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కును హరించే విధంగా ఈ లేబర్ కోడ్స్ ను తీసుకొచ్చారని అన్నారు. ఇప్పటికే వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తీవ్ర పనిభారంతో అభద్రతాభావంతో పనిచేస్తుంటే ఈ లేబర్ కోడ్స్ ద్వారా యజమానులకు, కార్పొరేట్ శక్తులకు మరింత ఊడిగం చేసే కార్మికులను బానిసలుగా మార్చే విధంగా ఈ లేబర్ కోడ్స్ ఉన్నాయని అన్నారు. అందుకే దేశంలో కేంద్ర కార్మిక సంఘాలు, వివిధ ఫెడరేషన్ లో పిలుపుమేరకు ఫిబ్రవరి 12న సమ్మె నిర్వహిస్తున్నట్లు ఈ సమ్మెలో కార్మిక వర్గం రేపు అచ్చుతాపురం ఎమ్మార్వో కార్యాలయం నుండి అచ్చుతాపురం నాలుగు రోడ్ల కూడలి వరకు జరిగే ర్యాలీ, మానవహారం లో కార్మికులు అంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఠామేస్త్రి పంచదారల పైడిరాజు ,తాతారావు, లాలం సత్తిబాబు, రాజన్న సత్తిబాబు, వెంకట్రావు, రాము తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిందితుడికి 10 నెలలు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమాన



**అనకాపల్లి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** జిల్లాలోని చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో నమోదైన 60 కిలోల గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడైన శీర అప్పలనాయుడుకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానాను చోడవరం తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.హరినారాయణ తీర్పును వెలువరించారని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా అనకాపల్లిని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, గంజాయి స్మగ్లర్లకు కఠిన శిక్షలు పడేలా చేయడంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ఈ కేసులో పక్కా ఆధారాలతో చార్జ్ షీట్ దాఖలు చేసి, నేరం రుజువు చేయడంలో కీలక పాత్ర పోషించిన అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా లేదా రవాణా చేసినా ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరుతున్నామన్నారు.




## అలజంగి గ్రామం వద్ద స్కూల్ బస్సు బోల్తా!

### పలువురు విద్యార్థులకు గాయాలు



**బొబ్బిలి, ఫిబ్రవరి11, మేజర్ న్యూస్ :** మండలంలోని అలజంగి గ్రామం వద్ద బుధవారం స్కూల్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పరువురు విద్యార్థిలకు చిన్న చిన్న గాయాలు అయ్యాయి. ఈ సంఘటనలో ప్రాణాపాయం తప్పింది. అందరూ సురక్షితంగా ఉండడంతో తల్లి తండ్రులలో ఆందోళన తప్పింది.

## రైతు ఉత్పత్తి దారుల సంఘాలు బలోపేతం



**చీపురుపల్లి ఫిబ్రవరి 11 (మేజర్ న్యూస్) :** రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహించి బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీవో ఐ సురేష్ అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల నాయకులతో సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు వలె మహిళా రైతు సంఘాలు కూడా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా మహిళా రైతులకు వ్యవసాయం చేయుటకు అవసరమయ్యే వ్యసాయ పరికరాలు ను అద్దెకు ఇవ్వడం, కోల్డ్ స్టోరేజ్, గౌడౌన్లు ఏర్పాటు, సమీకృత వ్యవసాయ విధానం ద్వారా రైతుల ను అధిక ఆదాయం వచ్చే ఉద్యాన పంటలు వైపు మల్లించడం, అలాగే మహిళా రైతు సంఘాలకు వ్యవసాయం చేయడంలో ఆధునిక సాంకేతికత విజ్ఞానం అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇవన్ని అందిపుచ్చుకోవాలంటే మహిళా రైతు గ్రూప్ లను బాగా నడిపించించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎన్ అప్పలనాయుడు, ఏపీఓ అదిబాబు, సీసీలు, రైతు సంఘాల మహిళా నాయకులు పాల్గొన్నారు.

# వినండి.. సమస్యలను పరిష్కరించండి

– రాష్ట్ర సచివాలయంలో మంత్రులను కలిసిన భోగాపురం రైతులు – ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు చొరవతో రైతుల్లో ఊరట





**భోగాపురం, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయానికి భోగాపురం రైతుల సమస్యలు వెళ్లాయి. ఏపీ మార్ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల తెదేపా ఇన్చార్జి కర్రోతు బంగార్రాజు చొరవతో నేరుగా రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితని, విజయ నగరం జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ ను నేరుగా కలసి భోగాపురం, ముంజేరు గ్రామాల రైతులు భూముల సమస్యల కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, రైతుల హక్కులను పరిరక్షించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రైతుల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి తన కర్తవ్యమని, ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని బంగార్రాజు స్పష్టం చేశారు. ఈ విషయంపై మంత్రులు కూడా సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొమ్మూరు శు భోషణరావు, నాయకులు పడాల శ్రీనివాసరావు, మాత నవీన్, పల్లా రాంబాబు, బొడ్డ హరిబాబు, అడ్డగర్ల వెంకటరావు, శిరుగుడు గోవింద, రమేష్ రాజు, పల్ల కొండయ్య, రాంశెట్టి వెంకన్న, వెంకట్రావు, కోల ప్రసాదు, రమణమూర్తి, శిరుగుడు వెంకటేష్, బొండ రాజేష్ పాల్గొన్నారు.

## ఎంఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో వేగం పెంచాలి : ఏపిడీ జి.చంద్రకుమారి



**బాడంగి, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై ఏపిడీ శ్రీమతి జి.చంద్రకుమారి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో పనుల అమలు, లక్ష్య సాధన, బిల్లుల అప్లోడింగ్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఏపిడీ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో నిరంతరంగా పనులు సాగాలన్నారు. ప్రతి వారం కనీసం 250 కుటుంబాలకు 100 రోజుల ఉపాధి పూర్తిచేయించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించారు. లక్ష్య సాధనలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని హెచ్చరించారు. మెటీరియల్ పనులకు సంబంధించిన బిల్లులను ఆలస్యం లేకుండా వెంటవెంటనే ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. పెండింగ్ బిల్లులు లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో 20 పనులకు మించి వర్కులు కొనసాగించకుండా పూర్తైన పనులను వెంటనే క్లోజ్ చేసి, కొత్త పనులను ప్రారంభించాలని స్పష్టం చేశారు. పనుల ప్రణాళిక సక్రమంగా ఉండేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ సాయిరాం, జేఈ హరినారాయణ, టీఏఎస్‌లు, సీఓఎస్‌లు, బీఎఫ్‌టీలతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

### – ఇంతవరకు రూ.40 కోట్లు వసూలు







**విజయనగరం కార్పొరేషన్, ఫిబ్రవరి 11: మేజర్ న్యూస్ :** నగరంలో ఆస్తి పన్ను వసూళ్లపై నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇంతవరకు 40 కోట్ల రూపాయల పన్నులు వసూలు జరగగా, ఇందులో ఆస్తి పన్ను 13,62,165 రూపాయలు, ఖాళీ స్థలాల పన్ను 23,60,108 రూపాయలు, వాటర్ టాక్స్ 1,28,133 రూపాయలు, షాప్ రూమ్స్ అద్దెలు 1,58,731 రూపాయల వసూలు జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను 55 కోట్ల రూపాయలు వసూలు కావాల్సి ఉంది. మార్చి నెలాఖరు నాటికి శాతం పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులను జారీ చేశారు. మొండి బకాయిల వసూళ్లకు రంగంలోకి దిగిన అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు బకాయిదారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్ స్పెక్టర్లు అప్పలరాజు సాయిప్రసాద్ వినోద్ కుమార్ చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద కేసులో ముద్దాయికి ఆరు నెలలు జైలు

**దత్తిరాజేరు (మేజర్ న్యూస్) :** రోడ్డు ప్రమాద కేసులో గజపతినగరం జెఎఫ్‌సిఎం కోర్టు మంగళవారం ముద్దాయికి ఆరు నెలలు జైలుతోపాటు వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు పెదమానాపురం ఎస్ఐ జయంతి తెలిపారు. 2021 ఏప్రిల్ 27వ తేదీన నమోదు కాపాడిన రోడ్డు ప్రమాదం కేసులో దత్తిరాజేరు మండలం గడసాం గ్రామానికి చెందిన ప్రత్యూషవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ముద్దాయి దత్తిరాజేరు మండలం ఏం.లింగాలవలస గ్రామానికి చెందిన కొల్లా శంకర్రావు కు శిక్ష విధిస్తూ తుది తీర్పు కోర్టు వెల్లడించడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు నియమ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా ఎస్సై తెలిపారు.

## భోగాపురం సమస్యను ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా

### – రైతులకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మాధవి



**భోగాపురం, ఫిబ్రవరి 12 (మేజర్ న్యూస్) :** భోగాపురంలో భూములను తీసుకునేందుకు ఐటి పరిశ్రమల యాజమాన్యంతో స్థానిక అధికారులు రావడం రైతుల గుండెల్లో గుబులు పుడుతుందని తక్షణమే విరమించుకునేలా దయ తలచాలంటూ ఎమ్మెల్యే లోకం నాగమాధవి దృష్టికి భోగాపురం రైతులు తీసుకెళ్లారు. విజయవాడలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ పరిస్థితి తమ దృష్టికి వచ్చిందని ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, మరల ఈ పరిస్థితిని మరొకమారు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మూరు శుభోషణరావు, పడాల శ్రీనివాసరావు, పల్లంట్ల జగదీష్, వరుపుల సుధాకర్, మాత నవీన్, పల్లా రాంబాబు, బొడ్డ హరిబాబు, అడ్డగర్ల వెంకటరావు, శిరుగుడు గోవింద, రమేష్ రాజు, పల్ల కొండయ్య, రాంశెట్టి వెంకన్న, వెంకట్రావు, కోల ప్రసాదు, రమణమూర్తి, శిరుగుడు వెంకటేష్, బొండ రాజేష్ పాల్గొన్నారు.

# ఎయిర్ పోర్టుకు దారేది..!!

**– ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ డిమాండ్**

**(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)**

విశాఖపట్నం ఎయిర్ పోర్టుకు ప్రత్యామ్నాయంగా భోగాపురం విమానాశ్రయం రూపుదిద్దుకోవడం, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుగా మారడంతో విమానాల సంఖ్య కూడా భారీగా పెరిగే అవకాశముంది. ఇతరదేశాలకు వెళ్లాలంటే ప్రస్తుతం హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరుకు వచ్చివెళ్లాల్సిఉంది. కానీ ఇకపై ఈ విమానాశ్రయం నుంచి రద్దీని బట్టి నేరుగా ఇతరదేశాలకు విమానాలను ప్రయివేటు సంస్థలు నడిపే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయలేరు. దీనివల్ల సమయం తగ్గడంతో పాటు ప్రయాణ ఖర్చు కూడా తగ్గుతుందని కొందరు చెబుతున్నారు. ఇక భోగాపురం విమానాశ్రయం పనులు వేగంగా పూర్తి కావస్తుండటంతో ఆచుట్టు పక్కల ప్రాంతాల్లో భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. అయితే ఈ ఎయిర్ పోర్టు నిర్మాణం వల్ల ప్రజలకు ఎంత ఉపయోగం ఉంటుందో అదే విధంగా కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

**– ఇబ్బందులు కూడా ఉన్నాయి..?**

విశాఖపట్నానికి సుమారు 50-60 కిలోమీటర్ల దూరంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో, ప్రధానంగా నగర వాసులకు ప్రయాణ సమయం, దూరం, రవాణా ఖర్చులు పెరగనున్నాయి. ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్టును భోగాపురానికి తరలిస్తే, నగరానికి దూరంగా ఉండటం, మెరుగైన రవాణా సౌకర్యాలు లేకపోవడం ప్రధాన సమస్యలుగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ కూడా చెబుతుంది. ఫ్లైఓవర్లు, ప్రత్యేక లేన్లు లేదా ఎక్స్‌ప్రెస్‌వే వంటి మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోతే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాన్ని ఆ అసోసియేషన్ ప్రతినిధులు తెలియజేస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ఫార్మా సిటీ వంటి పారిశ్రామిక ప్రాంతాల ఉద్యోగులకు, వ్యాపారులకు ఈ దూరం వల్ల రాకపోకలు కష్టమవుతాయని అంటున్నారు. భోగాపురం అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రస్తుత విశాఖ ఎయిర్‌పోర్ట్ మూసివేస్తే ప్రయాణికులకు మరింత ఇబ్బంది కలుగుతుందని చెబుతున్నారు. భోగాపురానికి మెరుగైన, వేగవంతమైన రవాణా మౌలిక సదుపాయాలను సత్వరమే కల్పించాలని, గోవాలోని రెండు ఎయిర్‌పోర్టుల (దబోలిమ్ అలాగే మనోహర్) మాదిరిగానే, విశాఖపట్నం పాత ఎయిర్‌పోర్ట్‌ను కూడా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

**– ఈ కారణంతోనే భోగాపురం ఎయిర్పోర్ట్ నిర్మాణం !!**

ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న విమానాశ్రయం చాలా చిన్నది. ఇది కేవలం డొమెస్టిక్ ఫ్లైట్లు నడిపేందుకు మాత్రమే అనువుగా ఉంది. పైగా ఇది పూర్తిగా పౌర విమానాయాన శాఖ ఆధ్వర్యంలో లేదు. ఇది నావికా దళానికి చెందిన విమానాశ్రయం. ఒకప్పుడు ఇక్కడి రన్ వే చాలా చిన్నగా ఉండేది. అయితే, 2007లో పెద్ద విమానాలు సైతం దిగేందుకు అనువుగా 3 కిమీలకు పెంచారు. అయితే ఏ380 (ఎయిర్ బస్) వంటి అది పెద్ద విమానాలు దిగేందుకు వీలుగా లేదు. నేవీ ఆధ్వర్యంలో ఉండటం వల్ల దీన్ని ప్రయాణికుల సౌకర్యాలకు తగినట్లుగా డెవలప్ చేయడం సాధ్యం కావడం లేదు. పైగా ఈ విమానాశ్రయం నగరం నడిబొడ్డున ఉంది. భవిష్యత్తులో ఇక్కడి ఇండస్ట్రీస్, ఐటీ, జనాభా, ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండాల్సిందేనని భావించి ఎయిర్పోర్ట్ నిర్మాణానికి నిర్ణయం తీసుకొని దాని నిర్మాణం శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం భావించడం జరిగింది.

**– ఫ్లై ఓవర్లు, కోస్టల్ కారిడార్, మాస్టర్ ప్లాన్ రోడ్లు పూర్తి చేయాలి..**

అయితే ఇదిలా ఉండగా భోగాపురం విమానాశ్రయం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ కు మంచి గుర్తింపు వస్తుంది. అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుంది. అయితే విశాఖపట్నం నుంచి ఈ ఎయిర్ పోర్ట్ కి వెళ్లడానికి వెళ్లడానికి రెండు గంటలు, రావడానికి రెండు గంటల సమయం పడుతుంది. ఎయిర్పోర్ట్ నిర్మాణం ప్రారంభించి సుమారు ఏడు సంవత్సరాలు అవుతుంది. అయినప్పటికీ పూర్తిస్థాయిలో ఇక్కడి నుంచి ఏర్పోర్ట్ వరకు రహదారుల నిర్మాణం పూర్తి చేయలేదు. విశాఖ నుంచి ఎయిర్ పోర్టుకు కారులో వెళ్లడానికి రూ. 2000 ల నుంచి రూ.4000ల ఖర్చు అవుతుంది. కేవలం వెళ్లడానికి మాత్రమే. ఏడు మాస్టర్ ప్లాన్స్ రోడ్లు వెయ్యాలి కానీ ఇప్పటికీ ఆ పనులు పూర్తికాలేదు. కోస్టల్ క్యారిడార్ రోడ్డు అన్నారు అది ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. గాజువాక నుంచి వెళ్లే రూట్లో 12 ఫ్లైఓవర్లు ప్లాన్ చేశారు కానీ ఇప్పటివరకు ఒకటి కూడా ప్రారంభించలేదు. మామూలుగా అయితే భోగాపురానికి ఇక్కడి నుంచి సుమారు రోజుకి 8,000 వాహనాలు వెళుతుండటం జరుగుతుంది. ఇప్పుడు భోగాపురం ఎయిర్పోర్ట్ నిర్మాణంతో ఆ సంఖ్య ఏడులక్షలకు పెరిగింది. అయినా సరైన రోడ్డు మార్గాలు నిర్మాణం కాలేదు. ప్రస్తుతం విశాఖకు భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ఫ్లై ఓవర్లతోపాటు తో పాటు మాస్టర్ ప్లాన్ లో రోడ్లు పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**– సౌకర్యాలు మరింత మెరుగుపరచాలి..**

అమరావతి నుంచి హైదరాబాద్ వరకు బుల్లెట్ ట్రైన్ నడపాలని నిర్ణయం ఉంది. ఇందులో విశాఖపట్నం వరకు కూడా ఆ ట్రైన్ నడిపిస్తే బాగుంటుంది. పది వందే భారత్ ట్రైన్ తో పాటు అలాగే మెట్రో ట్రైన్లు కూడా ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగముంటుంది. కొత్త ప్రాజెక్టులు ఇక్కడికి రావడం వల్ల అనదనంగా మరో లక్ష మందికి పైగా ఇక్కడకు వచ్చే అవకాశం ఉంది. ఈ కారణంగా ఎక్కడ ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. పరిమితి ప్రయాణంతో ప్రజలు అవస్థలు పడే అవకాశం కూడా ఉంది. ప్రత్యేకంగా విశాఖపట్నం నుంచి భోగపురం ఎయిర్పోర్ట్ కు బస్సు సర్వీసులు కూడా పెట్టాలి. విశాఖలో ప్లాట్ఫారం ల సంఖ్య పెంచాలి, రైల్వే స్టేషన్ పరిధి విస్తరింప చేయాలి. అధికంగా ఇక్కడి నుంచి రైళ్లు ఏర్పాటు చేయాలి. విశాఖ నుంచి అయిదు పికప్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని ఇక్కడి నుంచి బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తే ఒకేసారి 50 నుంచి 70 మంది ప్రయాణికులు భోగాపురం ఎయిర్పోర్ట్ కి వెళ్లే అవకాశం ఉంది. దీని ద్వారా కార్లలో వెళ్లే వారి సంఖ్య తగ్గుతుంది. ఎయిర్ పొల్యూషన్ కూడా తగ్గుతుంది. అదేవిధంగా వీలైతే విశాఖపట్నం ఎయిర్పోర్ట్ ని కూడా కొనసాగించాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు.

# హత్యల కలకలం..!





**– కేసు నమోదు చేసిన పోలీసులు – అనందపురం లో ఘటన లో భర్త మృతి పై అనుమానం భార్యేనా..? – విచారణ ప్రారంభించిన పోలీసులు**

**(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)**



విశాఖలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. విశాఖలో కట్టుదిట్టమైన పోలీసు వ్యవస్థ ఉన్నప్పటికీ కూడా నేరాల పరంపర ఆగడం లేదు. ప్రతిచోట నగరంలోని ఏదో ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో ఘాతుకాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందుతున్న ఘటనలు ఎక్కువ అయ్యాయి. క్షణికావేశంలో కొందరు ఈ హత్యలకు పాల్పడుతుంటే, మరికొందరు పథకం ప్రకారం హత్యలు చేస్తున్నారు. నేరం చేసి తాము పోలీసులకు పట్టుబడతామని తెలిసింది అప్పటికి కూడా నేరాలు చేస్తూనే ఉన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో సరైన పోలీసు నిఘా లేకపోవడం, పోలీస్ గస్తీ ఏర్పాటు చేయకపోవడం, అనుమానితులపై చర్యలు తీసుకోకపోవడం, పాత నేరస్తులు పట్ల మెతక వైఖరి ప్రదర్శించడం వల్ల ఈ నేరాలు మరిన్ని జరుగుతున్నాయి. ఇక హత్యల పరంపర అయితే చెప్పనక్కర్లేదు. తాజాగా విశాఖలో రెండు హత్యలు నగర ప్రజలను భయానికి గురిచేసాయి. ఇందులో ఒకటి ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో జరగగా, మరొకటి ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆనందపురంలో అనుమానస్పద మృతి అయితే, ఆరిలోవలో మాత్రం పక్కా హత్యగా నిర్ధారించబడింది. ఇక వివరాల్లోకి వెళ్తే.. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో కాపు లక్ష్మి (48) అనే మహిళ బుధవారం దారుణ హత్యకు గురయింది. ఆమెను చాలా దారుణంగా హత్య చేయడం జరిగింది. హత్య అనంతరం ఇంట్లో రూ.5 లక్షల నగదు, బంగారం చోరీ జరిగినట్లు తెలుస్తుంది. అయితే ఈ ఘటనకు సంబంధించి మరిన్ని ఆధారాల కోసం పోలీసులు సిసి ఫుటేజీని పరిశీలిస్తున్నారు. మాస్క్ పెట్టుకొని ఇంట్లోకి చొరబడిన వ్యక్తి ఆమెను ఊపిరాడకుండా చేసి హత్య చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. స్థానికంగా ఈ ఘటన ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఆరిలోవ కాలనీ దుర్గా బజార్ సెక్టర్ – 3 లో కాపు రమణ లక్ష్మీదంపతులు నివాసముంటున్నారు. భర్త రమణ జీవీఎంసీ ఉద్యోగి. లక్ష్మి గత 15 సంవత్సరాలుగా చీటీలు అదే ప్రాంతంలో నడుపుతూ ఉంది. బుధవారం సాయంత్రం తన భర్త డ్యూటీ నుండి ఇంటికి వచ్చి చూసేసరికి లక్ష్మి శవమై మంచంపై పడి ఉండడంతో కంగారుపడి పోలీసులకు సమాచారం అందజేశారు. ఇంట్లో ఉన్న ఐదు లక్షల నగదు, మెడలో ఉన్న బంగారం, చేతి ఉన్న బంగారు గాజులు లేకపోవడంతో లక్ష్మి ను గుర్తుతెలియని వ్యక్తి హత్య చేసి బంగారం అపహరించినట్లు గమనించారు. రంగంలోకి దిగిన ద్వారక ఏసిపి అన్నెపు నరసింహమూర్తి, సీఐ సిహెచ్. మల్లేశ్వరరావు తో పాటు క్రైమ్ సీఐ చక్రధర్ ఎస్సైలు రాందాసు, హరికృష్ణ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మృతిచెందిన మహిళ ఇంటికి ఉన్న సిసి ఫుటేజ్ , అదేవిధంగా వీధిలో ఉన్న సిసి ఫుటేజీలు పరిశీలించి, చుట్టుపక్కల వారి వద్ద నుండి ముఖ్యమైన వివరాలు సేకరించారు. అయితే ఉదయం 10:30 గంటలకు ఓ వ్యక్తి తన ఇంటిలోకి ప్రవేశించిన మరల 12:30 గంటలకు మహిళ ఇంట్లో నుండి వెను తిరిగినట్లు సిసి ఫుటేజ్ లో తెలుస్తున్నట్లు సమాచారం. కేసును ఆరిలోవ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**– ఆనందపురంలో వ్యక్తి అనుమానాస్పద మృతి ?..**

ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం, ఓ మహిళ దారుణ హత్యకు గురి కావడం జరగగా, ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అనుమానాస్పద మృతి ఘటన చోటు చేసుకోవడం జరిగింది. ఇలా వరుసగా ఒకే రోజు విశాఖలో ఈ ఘటనలు జరిగాయి. ఆనందపురం మండల కేంద్రంలోని స్మశానం సమీపంలో ఉన్న ఒక పందుల ఫారంలో బుధవారం ఉదయం, ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటం స్థానికంగా కలకలం రేపింది. వాచ్మెన్ కి పని చేస్తున్న ఆ వ్యక్తి శరీరంపై గాయాలు ఉండటంతో అతని భార్య అనుమానం వ్యక్తం చేయడం జరిగింది. రంగంలోకి దిగిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు ప్రారంభించారు. సదరు వ్యక్తి ఏ విధంగా మృతి చెంది ఉంటాడు అనే అనుమానంతో పలు కోణాలలో పోలీసులు విచారణ చేపట్టారు. ప్రకారం తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలోని కొండగూడెంకు చెందిన శివ (38) గత ఆరు నెలలుగా ఈ ప్రాంతంలో వాచ్‌మన్‌గా పనిచేస్తూ భార్యతో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం ఉదయం తన భర్త మృతి చెందాడని, అతని ఒంటిపై గాయాలు ఉన్నాయని భార్య సమాచారం ఇవ్వడంతో పోలీసులు రంగంలోకి దిగారు. సీఐ వాసునాయుడు, ఆనందపురం, మధురవాడ ఎస్.ఐ. ల బృందం లతో పాటు క్లూస్ టీం,డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించాయి. దీనిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి,అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# భక్తులు సమన్వయం పాటించాలి..

**– సి ఐ, ఎం శ్రీనివాసరావు. – ఎస్సై బలివాడ గణేష్..**

**నరసన్నపేట, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** నరసన్నపేట సర్కిల్ పరిధిలోని ప్రజలందరూ శివరాత్రి పర్వదినం సందర్భంగా పలు జాగ్రత్తలు పాటించాలని సిఐ,ఎం శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా దేవాలయాలకు వెళ్లే భక్తులు సమన్వయం పాటించాలని, రద్దీకి దూరంగా ఉండాలని, విలువైన ఆభరణాలు ధరించి రోడ్లపై సంచరించవద్దని సూచించారు. ఆలయ నిర్వాహకులు దేవాలయాల వద్ద భారీకేడ్లు ఏర్పాటు చేయాలని, భక్తులందరికీ సహకరించేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని, పోలీసు సహకారాన్ని కూడా ఉపయోగించుకోవాలని అన్నివేళలా పోలీస్ సిబ్బంది ప్రజా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటారని అన్నారు. భక్తిశ్రద్ధలతో ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సామరస్యంగా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం శ్రీనివాసరావు, ఎస్సై బలివాడ గణేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# పిఆర్సి సాధన కోసం 17న చలో విజయవాడ

**– వి శ్రీ లక్ష్మి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి**




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళంలోని యూటీఎఫ్ భవన్లో , యుటీఎఫ్ ప్రాంతీయ సమావేశం జిల్లా సహాధ్యక్షులు ఎండ ఉమా శంకర్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీలక్ష్మి ప్రసంగిస్తూ 12వ పిఆర్సి 2023 జూలై నుండి అమలు కావలసి ఉండగా నేటికీ కనీసం పిఆర్సి కమిషన్ను నియమించకపోవడం దుర్మార్గమని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని పిఆర్సి కమిషన్ వెంటనే నియమించాలని, 29% ఫిట్మెంట్ ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, పెండింగ్ డిఏ లను చెల్లించాలని, మెమో 57ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల ఉపాధ్యాయుల కార్మికుల ఆర్థిక ప్రయోజనాల కోసం ఫిబ్రవరి 17న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షులు కోరాడ వైకుంఠరావు, జిల్లా సహాధ్యక్షులు బి ధనలక్ష్మి, జిల్లా కోశాధికారి పి సూర్య ప్రకాష్,రాష్ట్ర కమిటీ సభ్యులు చౌదరి రవీంద్ర, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా కార్యదర్శులు గొంటి సురేష్, ఎస్ స్వర్ణ కుమారి, టివిటి భాస్కర్, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్ దమయంతి, మహిళా విభాగం నాయకులు కే శాంతి ప్రియ, పూర్వ జిల్లా కార్యదర్శి యూఏ సూర్యనారాయణ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి బాబూరావు, బోడిగి శ్యాంకుమార్, శ్రీకాకుళం రూరల్ టౌన్ ఎచ్చెర్ల లావేరు రణస్థలం గార నరసన్నపేట ఆమదాలవలస మండల శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సమావేశంలో ఫిబ్రవరి 12న జరుగుతున్న కార్మికుల ఆల్ ఇండియా సమ్మెకు మద్దతు తెలియజేస్తున్నట్లు దానిని జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు.

# వసప కేజీబివి ఆకస్మిక తనికీ చేసిన ఎంపిడిఓ.

**కొత్తూరు, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తూరు మండలం వసప కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబివి )ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి వి యస్ ప్రసాదరావు (రాంబాబు ) బుధవారం ఆకస్మిక తనికీ చేశారు. పిల్లలకు ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ సక్రమంగా అమలు చేస్తూ పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలని ప్రిన్సిపాల్ టి కళావతమ్మ ను ఆదేశించారు. స్టాకు రిజిస్టర్లు, వంట గదులను పరిశీలించారు. బాత్ రూమ్ లు , వంట గదులు, పాఠశాల పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. కూరగాయలు నాణ్యత,పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికల ఆరోగ్యం ,చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి నాన్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్యార్థినులు పదవతరగతి పరీక్షలు పై దృష్టి సారించాలని ఎంపిడిఓ అన్నారు. పరీక్షా ఫలితాల శాతం పెంచే విధంగా పిల్లలను సమాయత్తం చేయాలని ఆయన టీచర్లను ఆదేశించారు. ఆయన వెంట డెప్యూటీ ఎంపిడిఓ బి సుదర్శన రావు, పంచాయితీ కార్యదర్శి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



# గంజాయితో నలుగురు అరెస్ట్...



**నరసన్నపేట, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** నరసన్నపేట ఎస్సై బి గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు గంజాయిని తరలిస్తున్న రెండు వేరు వేరు కేసులలో నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించారు. ఈ కేసు కు సంబంధించిన పూర్తి వివరాలను నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం శ్రీనివాసరావు బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన ఆసిఫ్ ఖాన్, ఆదిల్ ఖాన్ ఒరిస్సా రాష్ట్రం నుండి గంజాయిని ఉత్తరప్రదేశ్ తరలిస్తుండగా మడపాం టోల్గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సిఐ వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఇస్సాక్ రైతా సాగర్ పహాన్ ఒరిస్సా రాష్ట్రం నుండి హైదరాబాద్ కు 12 కేజీల గంజాయిని తరలిస్తుండగా మడపాం టోల్ ప్లాజా వద్ద నరసన్నపేట సబ్ ఇన్స్పెక్టర్ బలివాడ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీలలో అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలియజేశారు . నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టుకి తరలించినట్లు ఆయన తెలియజేశారు. నరసన్నపేట సబ్ ఇన్స్పెక్టర్ బలివాడ గణేష్ ఉన్నారు.




# భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి

**– జిల్లా జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఖాన్**



**టెక్కలి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చిన భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం రావివలస గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ముందుగా ఎండల మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పరిశీలన చేస్తూ శివరాత్రి ఉత్సవాలకు భక్తులు పెరిగే అవకాశం ఉన్నందున క్యూలైన్లు బారికేడ్లు నిర్మించాలన్నారు. భక్తులకు ఆలయానికి చేరేవరకు ఎండ తగలకుండా ఏర్పాట్లు చేయాలని, త్రాగునీరు, విద్యుత్ దీపాలు, వైద్య శిబిరం, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ మరియు పోలీస్ బందోబస్తు తదితర సౌకర్యాలు సక్రమంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఉచిత దర్శనం, చిత్ర ప్రసాద పంపిణీ ఏర్పాటును సక్రమంగా దేవాలయ ప్రాంగణంలో భక్తులకు అందే విధంగా సౌకర్యాలు కల్పించాలని కార్య నిర్వహణ అధికారి జి గురునాథరావు ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాల విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి, దేవాదయశాఖ సహాయ కమిషనర్, తహసిల్దార్ సత్యం, తదితర శాఖలు అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి బాటలో శ్రీకాకుళం

**– మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే గొండు శంకర్ భేటీ**



**అమరావతి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం అమరావతిలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో కీలక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరసవెల్లి రథసప్తమి వేడుకలను అధికారికంగా 'రాష్ట్ర పండుగ'గా గుర్తించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ ఆకాంక్షల మేరకు ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించినట్లు ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. భవిష్యత్తులో పర్యాటక రంగానికి మరింత పెద్దపీట వేయాలని కోరగా, మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం నగరంలో ప్రధాన సమస్యగా ఉన్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు రోడ్ల విస్తరణ అత్యవసరమని, ఇందుకు అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన నిధులు, కొత్తగా చేపట్టాల్సిన కల్వర్టులు, డివైడర్లు, నగర సుందరీకరణ పనులపై చర్చించారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేష్.. కూటమి ప్రభుత్వం శ్రీకాకుళం అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రతిపాదించిన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.




## ఆహార భద్రత నియమాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



**పార్వతిపురం రూరల్ ఫిబ్రవరి 11 మేజర్ న్యూస్ :** ఆహార భద్రత నియమాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ వైస్ చైర్మన్ సిహెచ్ హరిబాబు అన్నారు. బుధవారం పార్వతీపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ రావుతో కలిసి విద్యార్థులకు , మంచి ప్రమాణాలతో కూడిన వస్తువుల కొనుగోళ్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ వస్తువు కొనుగోలు చేసిన ఎక్స్పైరీ తేదీలను గమనించడంతోపాటు బ్యూరో ఆఫ్ స్టాండర్డ్స్ ఎఫ్ఎస్ ఎస్ఎఐ, బంగారం కొనుగోలు చేసేటప్పుడు హాల్ మార్క్‌లను గమనించాలని, విద్యార్థులు వీటిపై అవగాహన పెంచుకొని ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, కృష్ణ విర్, సీసీఐ సభ్యులు వారణాసి సత్యనారాయణ ఉన్నత పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పారమ్మకొండకు విచ్చేసే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

– మహా శివరాత్రి దృష్ట్యా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి – భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకుని ఆనందంగా వెళ్లాలి

– జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి వెల్లడి





**పాచిపెంట, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** మహాశివరాత్రి పురస్కరించుకుని పారమ్మకొండ దేవాలయంకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్ర పరిసరాల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని, భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. క్యూ లైన్ల క్రమబద్ధీకరణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకుని ఆనందంగా ఇంటికి చేరుకునేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం పాచిపెంట మండలం పారమ్మకొండపై ఉన్న పారమ్మ తల్లి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ కుటుంబ సమేతంగా సందర్శించారు.

ఆలయానికి విచ్చేసిన కలెక్టరుకు ఈఓ, అర్చకులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పారమ్మతల్లి చిత్రపటాన్ని కలెక్టర్ కు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన పారమ్మకొండ దేవాలయాన్ని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం కొండపై ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొండపై ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రతి చోటా డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని, తడి చెత్త – పొడి చెత్త వేరు చేసేలా ఫ్లెక్సీల ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు. కొండ దిగి వచ్చిన భక్తులకు కాళ్ళ నొప్పుల నుండి ఉపశమనం కలిగించేలా 'గోరువెచ్చని నీటి' సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, దీనికి అతి తక్కువ రుసుము వసూలు చేయాలని సూచించారు. అలాగే తినుబండారాల స్టాల్స్ కూడా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన సాయం అందించేందుకు వాలంటీర్లను సిద్ధం చేయాలని, వారు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ ఏర్పాట్ల ద్వారా భక్తులకు మరింత మెరుగైన సేవలందించడమే లక్ష్యం కావాలని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ టి.రమేష్, తహసీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రైమరీ హెల్త్ క్లీనిక్ సెంటర్ భవన నిర్మాణానికి భూమి పూజ



**సీతానగరం ఫిబ్రవరి 11 మేజర్ న్యూస్ :** మండలంలోని లక్ష్మీపురం సచివాలయం పరిధిలో ప్రైమరీ హెల్త్ క్లినిక్ సెంటర్ భవన్ నిర్మాణం కి బుధవారం భూమి పూజ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష. కార్యదర్శులు పెంట సత్యం నాయుడు. ఆర్ వేణుగోపాల్ నాయుడు శంకుస్థాపన పూజా కార్యక్రమాలు చేశారు ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం లో మంజూరైన భవనాల పనులు ఎక్కడ జరగలేదని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ మండలంలో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని మాటలతోనే కాకుండా చేతలతోనే అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు మండలంలో అనేక రహదారులను నిధులు మంజూరు చేయడం జరిగిందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం నాయకులు కొల్లి సురేష్. తేలు శేఖర్.చప్ప విజయలక్ష్మి. మజ్జి చప్ప సుధాకర్ గవర భాస్కరరావు .దొడ్డి గోదావరినాయుడు. బోను శ్రీనివాసరావు, మజ్జి ధనుంజయ్. మండల నాయకులు జి అన్నం నాయుడు జి.జ్యోతిలక్ష్మి నాయుడు సీతానగరం ఆయకట్టు అధ్యక్షులు వెంకటప్ప నాయుడుతో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## ఏకీకృత కుటుంబ సర్వే నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలి

– హౌస్ టాక్స్ వసూల్ పై ప్రత్యేక దృష్టి సాధించాలి

– ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలి : డిప్యూటీ ఎంపీడీవో కేకే వర్మ





**సీతానగరం, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా చేపట్టి అందించేందుకు గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం చేపడు తున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (ఏకీకృత కుటుంబ సర్వే)ను నిర్దే శించిన సమయంలోగా పూర్తి చేయాల్సి ఉందని డిప్యూటీ ఎంపీడీవో కేకే వర్మ అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని సుమిత్రపురం, పెదంకలం, కృష్ణారాయిపురం, లక్ష్మీపురం గ్రామంలో ఆయా సచివాలయ పరిధిలో పంచాయతీ కార్యదర్శిల ఆధ్వర్యంలో చేపడుతున్న యూని ఫైడ్ ఫ్యామిలీ సర్వేను. ఇంటిపన్ను వసూళ్లు. ఎస్డబ్ల్యూపిసి కేంద్రాలను పరిశీలిం చారు. ఈసందర్భంగా గ్రామంలో చేపడుతున్న ఏకీకృత కుటుంబ సర్వేకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యదర్శి లకు సూచనలు సలహాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏకీకృత కుటుంబ సర్వే ద్వారా ప్రతి ఇంటి నుంచి 38 కీలక అంశాలను సేకరిం చడం జరుగుతుందని . ఆధార్ లేదా ఐరిష్ ప్రమాణీకరణతో మొబైల్ యాప్ లో చేపట్టడం జరుగుతుందని వివరించారు. ఈసర్వేలో గృహ యజమాని వివరాలతో పాటు ఇంటి మ్యాపింగ్ చేయవలసి ఉందని సూచించారు. అదే విధంగా కుటుంబ సభ్యులకు వయస్సు విద్యార్హతలు ఉపాధి స్థితి వార్షిక కుటుంబ ఆదాయము భూమి వివరాలను సర్వేలో నమోదు చేయాల్సి ఉంద న్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ఏకీకృత కుటుంబ సర్వేను చేపట్టడం జరుగుతుందన్నారు అలాగే ఇంటి పన్ను వసూళ్లపై కూడా సిబ్బంది ప్రత్యేక దృష్టి సాధించాలని వారితోపాటు ఎస్ డబ్ల్యూ పిసి సెంటర్లను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి నుండి ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు

– యజ్ఞ యాగ కర్త ఎస్‌విఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో కళ్యాణం – బివిపురంలోని జగదీశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం – బొత్స సత్యమునాయుడు బ్రదర్స్ మరియు చక్రధర్, జగదీష్...





**గరుగుబిల్లి, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బురద వెంకటాపురం గ్రామంలోని శ్రీజగదీశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీన మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మహా శివ రాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీశివపార్వతుల కళ్యాణ మహోత్సవమును ఘనం గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్తలు బొత్స సత్యమునాయుడుతో పాటు, బొత్స చక్రధర్, బొత్స జగదీష్‌లు తెలిపారు.

ఈమేరకు ఉదయం అభిషేకములు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించ నున్నామన్నారు. అనంతరం శ్రీజగ దీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వీరఘట్టముకు చెందిన ప్రముఖ యజ్ఞ యాగ కర్త ఎస్‌విఎల్ఎన్ శర్మయాజి సంపూర్ణ పర్యవేక్షణలో శ్రీశివపార్వతుల కల్యాణ మహోత్స వంను అంగరంగ వైభవంగా నిర్వ హించనున్నామని బొత్స చక్రధర్, బొత్స జగదీష్ లు తెలిపారు.

ఈమేరకు శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాద ములు స్వీకరించాలని చక్రధర్, జగదీష్‌లు కోరారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమమును నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదమును స్వీకరించాలని పేర్కొన్నారు. మహా శివరాత్రి పర్వదినము సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని బొత్స చక్రధర్, బొత్స జగదీష్‌లు తెలిపారు.

# మానవ వనరుల అభివృద్ధిపై దేశం మరింత దృష్టి సారించాలి



**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** గీతంలో ఆర్థిక నిపుణుడు ప్రొఫెసర్ చటోపాధ్యాయ ప్రముఖ ఆర్థికశాస్త్ర నిపుణుడు, జేఎన్‌టీయు (న్యూఢిల్లీ) విద్యా ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ సౌమెన్ చట్టోపాధ్యాయ బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ బిజినెస్ స్కూల్ ను సందర్శించి యూనియన్ బడ్జెట్‌పై విద్యర్థులతోతన అభిప్రాయాలను పంచుకున్నారు. యూనియన్ బడ్జెట్ 2026--27ను సమీక్షిస్తూ, స్వాతంత్ర్యం తరువాత భారత అభివృద్ధి వ్యూహం ప్రధానంగా భౌతిక మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిందని, అయితే మానవ వనరుల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన అభిప్రాయపడ్డారు.మానవ వనరులలో నైపుణ్యాలను పెంచడం ద్వారా ఉత్పాదకత పెరుగుదల, సాంకేతిక ఆవిష్కరణలు, బాధ్యతాయుత పౌరుల నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అందువల్ల విద్య, ఆరోగ్యం, పరిశోధన రంగాలపై సామాజిక వ్యయానికి కీలక ప్రాధాన్యం ఉందన్నారు. దేశంలో తగ్గిన ఉపాధి అవకాశాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ గణాంకాల ప్రకారం 53% పట్టభద్రులు(అండర్ గ్రాడ్యుయేట్లు) మరియు 36% పీజీ పట్టభద్రులు తగిన ఉద్యోగాలు పొందలేకపోతున్నారని తెలిపారు. అలాగే 65.3% కార్మిక శక్తికి ఎలాంటి నైపుణ్య లేదా వృత్తి శిక్షణ లభించలేదని, 90.2% మంది కార్మికులు మాధ్యమిక స్థాయి లేదా దానికంటే తక్కువ విద్య కలిగి ఉన్నారని చెప్పారు. ఫలితంగా 88.2% మంది కార్మికులు ప్రాథమిక మరియు అర్ధ నైపుణ్య వృత్తుల్లోనే నిమగ్నమై ఉన్నారని వెల్లడించారు. విద్యా వ్యవస్థ మరియు ఉద్యోగ , ఉపాధి రంగాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడం భారతదేశానికి అతిపెద్ద సవాలు అని అన్నారు. "యువ శక్తి ఆధారిత బడ్జెట్"గా పేర్కొన్న ఈ ఏడాది బడ్జెట్‌లో ఐటీఐల అభివృద్ధి, "ఆరెంజ్ ఎకానమీ" కింద పాఠశాలలు మరియు కళాశాలల విస్తరణ, పరిశ్రమల సమీపంలో యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు, ప్రతి జిల్లాలో బాలికల వసతి గృహాలు, రంగాల వారీగా నైపుణ్యాభివృద్ధి వంటి కార్యక్రమాలు ప్రతిపాదించబడినట్టు చెప్పారు. అయితే శిక్షణ నాణ్యత మరియు వేగంగా మారుతున్న పరిశ్రమ అవసరాలకు, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు ప్రభావానికి అనుగుణంగా స్పందించగల సామర్థ్యం అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. 'వికసిత భారత్' లక్ష్యం కేవలం ట్రిలియన్ డాలర్ల జీడీపీ సాధనంతో పరిమితం కాకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యక్తిపరమైన ఆదాయ పెరుగుదల, ఆదాయ అసమానతల తగ్గింపు, విద్య మరియు ఆరోగ్య సూచికల మెరుగుదల వంటి అంశాలు కూడా అభివృద్ధి ప్రమాణాలుగా పరిగణించాలన్నారు. సమానత్వం, సమగ్రత మరియు స్థిరమైన అభివృద్ధి ద్వారా మాత్రమే బడ్జెట్ భారతదేశాన్ని మానవీయ మరియు భాగస్వామ్య అభివృద్ధి దిశగా తీసుకెళ్తుందని ఆయన అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరక్టర్ లుబ్జా నిహార్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. రాధా రఘురామపాత్రుని అధ్యక్షత వహించారు.

# ఏయూ మహిళల నెట్ బాల్ జట్టు ఎంపిక



**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** ఆంధ్రవిశ్వవిద్యాలయం మహిళల నెట్ బాల్ జట్టు ఎంపిక జరిగింది. ఈనెల 14 నుంచి 18 వరకు కృష్ణ యూనివర్శిటిలో ఆల్ ఇండియా యూనివర్శిటి నెట్బాల్ పోటీలు జరగనున్నాయని, ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్. విజయమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఏయూ ఆచార్య ఎన్. విజయమోహన్, విభాగం హెడ్ ఆచార్య ఎ పల్లవి క్రీకారులకు అభినందనలు తెలిపారు. డా జట్టు మేనేజర్ డాక్టర్ గోపిక్రిష్ణ, క్రీడాకారులు వున్నారు.

# సైన్స్ కళాశాల చీఫ్ వార్డెన్‌గా ఆచార్యవి సిద్ధయ్యనియామకం



**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్కళాశాల మరియురీసెర్చ్ స్కాలర్సొ హాస్టల్ చీఫ్ వార్డెన్ గా కెమిస్ట్రీ విభాగం ఆచారలువి. సిద్ధయ్య నియమితలయారు ఉపకులపతి ఆచార్యజి.పి రాజశేఖర్ చేత మీదుగా నియామక ఉత్తర్వును ఆచార్య వి. సిద్దయ్య సీకరించారు విద్దారలకు ఆరోగకరమైన వాతావరణంలో, పోషకాలతో కడిన ఆహారాన్ని అందించే విధంగా నిరంతర పరివేక్షణతో పని చేయాలని విసి సూచించారు సిబ్బదితో సమనయం చేస్తూ హాస్టల్ను ఆదరంగా తీరిదిదాలనాళ్లు ఈ సందర్భగా ఆచార్య సిద్ధయ్యను ఏ.యుఅధికారు లు ప్రొఫెసష్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేసారు.

# శివరాత్రికి రహదారి క్లియరెన్స్



**శృంగవరపుకోట, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** మహాశివరాత్రి సందర్భంగా పుణ్యగిరికి విచ్చేయు భక్తుల సౌకర్యార్థం పట్టణంలోని దేవి కూడలి నుంచి పుణ్యగిరి దిగు వరకు రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేసి మరియు రహదారిపై ఏర్పడ్డ గోతులను పూర్తి సదుని చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామపంచాయతీ నుంచి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోష్ కుమారి, పంచాయతీ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు.

# శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



**శృంగవరపుకోట, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** మహాశివరాత్రి సందర్భంగా పుణ్యగిరికి, మరియు ధర్మవరం వద్దగల సన్యాసేశ్వర స్వామి దేవాలయాలకు విచ్చేయు భక్తులకు కల్పించే సౌకర్యాలను గూర్చి బుధవారం తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ శ్రీనివాసరావు వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రికి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగడా అన్ని శాఖలు పనిచేయాలని ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య, మంచినీరు, మరుగుదొడ్లు వైద్య సేవలపై దృష్టి సారించాలని శివరాత్రికి పుణ్యగిరి కి విచ్చేసిన భక్తులను సంతృప్తిగా పంపించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సన్యాసయ్య పాలెం దేవాలయం కార్యనిర్వాహణాధికారి సాంబశివరావు, పుణ్యగిరి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి నాగేంద్ర మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏయూలో రక్తదాన శిబిరం



**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నేడు రక్తదాన శిబిరాన్నీ నిర్వహించారు. సౌత్ క్యాంపస్లోని వైద్య కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో విలువైన ప్రాణాలకు రక్షించే ప్రాణదాతలుగా రక్తదాతలు నిలుస్తారన్నారు. రక్తకొరతను నివారించే విధంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేసారు. యువత ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగిస్తూ రక్తదానాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. హెల్పింగ్ హార్ట్స్ మరియు విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ క్లబ్ సౌజన్యంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని ఏయూ వైద్యాధికారి డాక్టర్ జి.ఏ.వి. రామేశ్వర్ తెలిపారు. ఏ.యు హెల్త్ కమిటీ చైర్మన్ ఆచార్య జి.వి.ఎస్.శర్మ, ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ చైర్మన్ కె.వి.శ్రీనివాస్, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి రాజకుమారి, ఏ.యు ఎన్.ఎస్.ఎస్.సమన్వయకర్త ఆచార్య సింహాచలం, ఆచార్య జి.సుభాషిణి దేవి, డిప్యూటీ రిజిస్ట్రార్ సాంబ మూర్తి, రక్తదాత పిళ్లా రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్ ఎన్నికలలో బిఎన్‌పి గెలిచే అవకాశం

: లక్కోజు శివరామ

**విశాఖపట్టణం , ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** బంగ్లాదేశ్లో 13వ పార్లమెంటరీ ఎన్నికలు ఫిబ్రవరి 12వ తారీకున జరుగుతున్నావేళ జ్యోతిష్య శాస్త్రంలో నవగ్రహాల గోచారం పరిశీలన చేయగా వాయిదాలు గాని, అల్లర్ల మధ్య ఓటింగ్ జరిగే అవకాశాలు వుండవచ్చుని అవామి లీగ్ పార్టీ షేక్ హాసిన పార్టీ నిషేదం లో వున్నందున బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టి అధ్యక్షుడు తారిఖ్ రహమాన్ మరియు జమాత్-ఇ-ఇస్లాం పార్టీ మధ్య గట్టి పోటి ఉన్నందున బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టి మిత్ర పక్షాలతో ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలు వుండ వచ్చునని ప్రముఖ వాస్తు జ్యోతిష్య పండితులు విశ్వకర్మ బ్రహ్మశ్రీలక్కోజు శివరామ ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు.

# నేటి సమ్మెను జయప్రదం చేద్దాం



**శృంగవరపుకోట, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** నేడు జరగబోయే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని పట్టణంలో గల నాలుగు ఆటో స్టాండ్ల డ్రైవర్లు పిలుపునిచ్చారు ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలను పంపిణీ చేశారు అనంతరం సిఐటియు ఆటో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు చెలికానీ ముత్యాలు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను తిప్పి కొట్టాలని, 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం పూర్తిగా అన్యాయమని ఆటో డ్రైవర్లకు హక్కుగా ఉన్న కార్మిక చట్టాలను నాశనం చేస్తూ వారిపైవిపరీతమైన ఫైన్లు వేయడం అన్యాయమని పేర్కొన్నారు ఆటో డ్రైవర్లు తక్షణమే ఆదుకోవాలని వారికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు ఆటో స్టాండ్ల యొక్క ప్రెసిడెంట్స్, సెక్రటరీలు మరియు డ్రైవర్లు రావాడ సన్యాసి దేవుడు, గోపి అప్పారావు, రాముడు, సురేషు తదితరులు పాల్గొన్నారు.

# పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా పెద్దిపాలెంలో ఘన నివాళులు..



**ఆనందపురం, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో పెద్దిపాలెం గ్రామం లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు, పార్టీ కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించారు. దేశానికి ఆయన చేసిన సేవలను, సమగ్ర మానవతావాదం సిద్ధాంతాన్ని ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ రూపాకుల రవి కుమార్ విచ్చేసి మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ దేశాభివృద్ధికి, సామాజిక సమగ్రతకు కృషి చేసిన మహనీయుడని తెలిపారు. ఆయన ఆశయాలను యువత అనుసరించి దేశ ప్రగతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ మీసాల రామా నాయుడు, కిసాన్ మోర్చ అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాస్ రావు, మండల ప్రధాన కార్యదర్శి పోతిన జీవన్ సంతోష్ , అడ్డురి సురేష్, ఉప్పాడ శివ, నిమ్మకాయల అప్పల రాజు, పాల్లూరి కృష్ణ రావు, గౌరి రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

# నూకాలమ్మ తల్లి ఉత్సవ కమిటీ కార్యాలయం ప్రారంభం



**భీమిలి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** భీమిలి శ్రీ నూకాలమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా ఏర్పాట్లు నిర్వహించడం కోసం బుధవారం శ్రీ నూకాలమ్మ తల్లి ఉత్సవ కమిటీ నూతన కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎంతో గొప్పగా జరిగే శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ తల్లి ఉత్సవాలను ఈ సంవత్సరం మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెల్పారు.తేదీ 17-03-2026 నుండి 20-03-2026వరుకు జరిగే పండగ మహోత్సవాలు అందరి సలహాలు సూచనలు మేరకు, గ్రామంలో ఉన్నటువంటి పెద్దలను, యువకులను కలుపుకుంటూ భారీ స్థాయిలో నిర్వహిస్తామని తె ల్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

## రబీ సీజన్ లో రైతులకు వ్యవసాయ రుణాలు పంపిణీ



**బుచ్చయ్యపేట, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** మండలంలో తురకలపూడి పి.ఎ.సి.ఎస్ ద్వారా బుదవారం 24 మంది రైతులకు వ్యవసాయ పెట్టుబడి నిమిత్తం 35లక్షల రూపాయలు పి.ఎ.సి.ఎస్ అధ్యక్షులు కోట సత్యనారాయణ పంపిణీ చేశారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ సకాలంలో రుణాలు రికవరీ చేసిన రైతులకు వడ్డీ రాయితీ కూడా వస్తుందని అన్నారు. అంతే కాక వాణిజ్య బ్యాంకులు దీటుగా ఒక ఎకరా భూమి ఉంటే వ్యవసాయ పెట్టుబడి నిమిత్తం ఒక లక్ష రూపాయలు రుణం మంజూరు చేస్తామని అలాగే ఎకరా భూమి సొసైటీకి తనకా పెడితే 5లక్షలు రూపాయల వరకు ఇస్తున్నట్లు తెలిపారు. మండలం లో పెద్ద సొసైటీ గా పేరు ఉన్న ఈ తురకలపూడి సొసైటీకి అన్ని రకాలు ప్రయోజ వచ్చే విధంగా స్థానిక ఎమ్మెల్యే రాజు ద్వారా డీసీసీబీ చైర్మెన్ కోన తాతారావు కి, జెనరల్ మేనేజర్ కి అభ్యర్ధ చేశామని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సత్యనారాయణ, సిబ్బంది శేశ్రీధర్ క(్రి నాయుడుబాబు పాల్గొన్నారు.

# సెంటనరీ క్రికెట్ సెమిఫైనల్స్ దశకు చేరిన నాల్గు కళాశాలల క్రీడా జట్లు



**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** ఆంధ్రవిశ్వవిద్యాలయం సెంటనరీ క్రికెట్ పోటీలు సెమిఫైనల్స్ దశకు చేరాయి. బుధవారం ఏయూ క్రీడా మైధానంలో బి. పూల్ మ్యాచ్ లు లో భాగంగా డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలకు ఎవిఎన్ కళాశాలకు జరిగిన క్వాటర్ ఫైనల్స్ మ్యాచ్ లో 9 వికెట్లు తేడాతో ఎవిఎన్ కళాశాలపై డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విజేతగా నిల్చింది. ఈ మ్యాచ్ గెలుపు సంధించి విజీతగా ని లిచింది. బుల్లయ్య కళాశాల సెమిఫైనల్స్ కు చేరింది. బుధవారం మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ లో డాక్టర్ ఎల్బి కళాశాల టాస్ గెల్చి ఫీల్డింగ్ ను ఎన్నుకుంది. బ్యాటింగ్ కు ఎవిఎన్ కళాశాల దిగి 10 ఓవర్లు ఆడి 32 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు. అనంతరం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల టీం బ్యాటింగ్ లో ఒక వికెట్ నష్టానికి 4 ఓవర్లు అడి 37 పరుగులు చేసిన విజేతగా నిల్చింది. ఈ మ్యాచ్ 9 వికెట్లుతో డాక్టర్ బుల్లయ్య కళాశాల విజేతగా నిల్చింది. ఈ సందర్భంగా ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్ విజయమోహన్ ఇరు జట్లును అభి నందించారు. ఈనెల 12 నుంచి నాల్గు పూల్ లో విన్నర్స్ సెమిఫైనల్స్ దశకు చేరినట్లు ఆచార్య ఎన్. విజయమోహన్ తెలిపారు. ఈ జట్టు లు నాకౌట్ మ్యాచ్చులు ఆడతాయని తెలిపారు. క్రికెట్ ఏ పూల్ లో ఏం.వి.ఆర్. డిగ్రీ కళాశాల గాజువాక, బీ.పూల్ విజేత డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల సి. పూల్ విజేత గవర్నమెంట్ డిగ్రీ కళాశాల గుమ్మలక్ష్మీపురం, డి. పూల్ విజేత అనకాపల్లి ఎ. ఎం.ఎ.ఎల్ కళాశాల నిల్చాయి. ఈ నాలుగుజట్లు నాకవుట్ మ్యాచ్లు అడి ప్రతిభ గల విన్నర్, రన్నర్ జట్లు ప్రైజ్ మణీ అందుకోనున్నారు. ఎ యూ వ్యాయామ విద్యావిభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విభాగం హెడ్ డాక్టర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మణరెడ్డి, ఎవిఎన్ కళాశాల పీడీ డాక్టర్ గోపీకృష్ణ, పరిశోధకులు ఉదయ్, హరి, ఎంపీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**- ముఖ్యఅతిథిగా ముగడ రాజారావు**



**ఆరిలోవ, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ,11వ వార్డు పరిధిలోగల బాలాజీ నగర్ శ్రీ సాయిబాబా ఆలయం ప్రక్కన అంగనవాడి కేంద్రంలో "నేహ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్" వారి ఆధ్వర్యంలో రెయిన్బో ఐ హాస్పిటల్, కేర్ ఎమర్జెన్సీ హాస్పిటల్ వారిచే మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 208 మందికి ఉచితంగా బీపీ షుగరు కంటి పరీక్షలు చేసి కళ్ళజోళ్ళు అందజేశారు. కేర్ హాస్పిటల్ బీపీ షుగర్ పరీక్షలు చేసి ఐదు వందల రూపాయల విలువ గల సంఘం కేర్ కార్డును 105 మందికి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ఎం. ఎస్. ఎం. ఈ డైరెక్టర్ ముగడ రాజారావు పాల్గొన్నారు. అనంతరం మెడికల్ క్యాంపును ప్రారంభించి, క్యాంపును నిర్వహించిన స్నేహ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నేహ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ డాక్టర్. ఎన్. సాయి ప్రకాష్ ,ఫీజియోథెరపిస్ట్ డిప్లమో అనస్టియస్ టెక్నిషియన్ రెయిన్బో ఐ హాస్పిటల్ జనరల్ మేనేజర్ సంతోష్ రాజు, కేర్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ ఇంటి సతీష్, సిబ్బంది, 11వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు రేఖా జ్యోతి,పేపర్ నాయుడు, మూది అప్పారావు, బోయి శ్రీను, ఆదినారాయణ , కొల్లి ఎర్రాజీరావు, మహిళ నాయకురాలు రావాడ జయ, చందక లలిత, తదితరులు పాల్గొన్నారు.

# నేడు సమ్మెను విజయవంతం చేయండి

**- కార్మికులకు ఉరితాడుగా మారిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి**



**ఆరిలోవ, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** కార్మికులకు ఉరితాడుగా మారిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేలు అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు పిఎఫ్,ఈఎస్ఐ తో కూడిన సమగ్ర చట్టం ఏర్పాటు చేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తదితరు డిమాండ్లపై ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం పాల్గొవాలని ఆరిలోవ ప్రాంతంలో ఆటో జాతా నిర్వహించాం.ఈ జాతాలో పాల్గొన్న సిఐటియు మద్దెలపాలెం జోన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులకు నష్టమైన లేబర్ కోడ్స్ తీసుకురావడం అన్యాయమని అన్నారు. కార్మికులు స్వతంత్రం ముందు నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరో ప్రక్క ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు.విశాఖ స్టీల్ ప్లాంట్ తో సహా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి ఫిబ్రవరి 12 సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ప్రజలకు నష్టమైన విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో బిల్డింగ్, ఆటో, ముఠా, ప్రభుత్వ హాస్పిటల్స్ కార్మికులు ,హెల్త్ సిటీ సిటీ కార్మికులు, ప్రజలు అత్యధికంగా పాల్గొవాలని అన్నారు. ఫిబ్రవరి 12 ఉదయం 10 గంటలకు సరస్వతీ పార్కు నుండి గాంధీ విగ్రహం వరకు జరుగు ర్యాలీలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆరిలోవ లో అన్ని ప్రాంతాలు ఆటో జాతా ప్రచారం చేశారు.

# నేడు పారిశుద్ధ్య కార్మికుల సమ్మె



**-నివాసితులు వ్యర్థాలు బహిరంగ ప్రదేశాలలో వేయరాదు -జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

**విశాఖపట్టణం , ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** గురువారం దేశవ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో భాగంగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు తమ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయరాదని బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. జీవీఎంసీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో పాల్గొంటున్న కారణంగా విధులకు హాజరు కానందున ఆరోజు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పడవేయరాదని, శు క్రవారం తమ వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు లేదా క్లాప్ వాహనాలకు వ్యర్థాలను అందించగలరని జీవీఎంసీ కమిషనర్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# డిజిటల్ అరెస్ట్ మోసగాళ్ల పై ఉక్కుపాదం

**- రూ.66 లక్షల మోసం కేసులో నిందితుడు అరెస్ట్**

**- ముంబై పోలీసుల పేరుతో వృద్ధుడిని బెదిరించి దోపిడీ**

**- 5 రోజులు వీడియో కాల్‌లో ఉంచి మానసికంగా వేధింపులు**

**విశాఖ క్రైం, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:**డిజిటల్ అరెస్ట్ పేరుతో నగరంలో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లపై విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రూ.66 లక్షలు దోచుకున్న భారీ సైబర్ మోసం కేసులో గుంటూరుకు చెందిన చాగంటి గౌతమ్ (40) ను అరెస్ట్ చేసి కీలక నిందితుడు ఆ ముఠా గుట్టు విప్పారు. ముంబై పోలీసుల పేరుతో భయాందోళన గురిచేశారు. విశాఖ జిల్లాకు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగికి వాట్సాప్ కాల్ ద్వారా అపరిచిత వ్యక్తి సంప్రదించాడు. “డిపాజిటర్స్ ప్రొటెక్షన్ బోర్డ్, ముంబై ప్రెసిడెంట్”గా పరిచయం చేసుకుని, ముంబై కొలాబా పోలీస్ స్టేషన్‌లో మనీ లాండరింగ్ కేసు నమోదైందని చెప్పి భయపెట్టాడు. అనంతరం కాల్‌ను మహారాష్ట్ర పోలీస్ డీఐజీ వికాస్ శర్మగా చెప్పుకున్న మరో వ్యక్తికి బదిలీ చేశారు. ఆ వ్యక్తి, బాధితుడి పేరుతో కెనరా బ్యాంకులో ఖాతా తెరుచుకుని కోట్లాది రూపాయల మనీ లాండరింగ్ జరిగిందని, సుప్రీంకోర్టు అరెస్ట్ వారెంట్ జారీ అయ్యిందని తీవ్రంగా బెదిరించాడు. దర్యాప్తు పేరుతో ఐదు రోజుల పాటు వీడియో కాల్‌లోనే ఉండాలని, ఎవరితోనూ మాట్లాడవద్దని ఆదేశించి మానసిక ఒత్తిడికి గురిచేశారు. చివరికి రూ.66 లక్షలను వివిధ “మ్యుల్” బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేయించుకుని మోసం చేశారు.

**- మ్యుల్ అకౌంట్ల ముఠా 5 కోట్ల లావాదేవీలు**

సైబర్ క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేసి, ఫర్మ్ పేరుతో బ్యాంక్ ఖాతా తెరిచి కమిషన్ కోసం ముంబై ముఠాకు సహకరించిన చాగంటి గౌతమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని ఖాతాలో సుమారు రూ.5 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న గ్యాంగ్‌తో సంబంధాలపై విచారణ కొనసాగుతోంది.

**- సీపీ హెచ్చరిక..తస్మాత్ జాగ్రత్త!**

సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి నగర ప్రజలకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు: తెలియని నంబర్ల నుండి “డిజిటల్ అరెస్ట్”, “కేసు నమోదైంది” వంటి కాల్స్ వస్తే నమ్మవద్దు. పార్సెల్‌లో డ్రగ్స్ ఉన్నాయని, ఆన్‌లైన్ విచారణ చేస్తామని చెప్పి వీడియో కాల్‌కు పిలిస్తే స్పందించవద్దు. ఆర్బీఐ వెరిఫికేషన్ పేరుతో డబ్బులు ట్రాన్స్ఫర్ చేయమంటే ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దు. పోలీస్, కోర్టు అధికారులు ఎప్పుడూ వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరు. ఫిర్యాదుకు 1930 -- వెంటనే స్పందించండి ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి. అదేవిధంగా విశాఖపట్నం సీపీ ప్రత్యేక నంబర్ 7995095799 కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు. సైబర్ నేరాలకు చెక్ కు ప్రజల అప్రమత్తతే ఆయుధం డిజిటల్ అరెస్ట్ మోసాలపై కఠిన చర్యలు తీసుకుంటూ, నగర ప్రజల భద్రత కోసం విశాఖ సిటీ పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని సీపీ స్పష్టం చేశారు. అప్రమత్తతతోనే ఇలాంటి మోసాలను అరికట్టగలమని ఆయన పేర్కొన్నారు.

# సైబర్ మోసాలు, మనీ న్యూలింగ్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**: జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్**



**అనకాపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** భారత రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ బుధవారం కలెక్టరు కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి ప్రారంభించారు. ఫిబ్రవరి ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు జరిగే వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సైబర్ మోసాలు, మనీ న్యూలింగ్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అంతేకాకుండా కేవైసీ, సికేవైసీ ప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృత అవగాహన, ప్రచారం కల్పించాలని బ్యాంకింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత పోస్టర్లు, టీవీ కమర్షియల్ యాడ్స్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సత్యనారాయణ ఎస్టీసీ కేఆర్సి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# బాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం



**ఆరిలోవ, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ, 12 వ వార్డు పరిధిలో గల చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా సాయిబాబా ఆలయంలో బుధవారం ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతసేవ, కాగడ హారతి,సామూహిక సాయి సత్యవ్రతములు జరిగాయి. సాయంత్రం పల్లకి ఉత్సవం, సేజ్ హారతి,పావళింపు సేవ లు జరిగాయి. ఈ వేడుకలు గురువారం శుక్రవారం రెండు రోజులు కూడా కొనసాగుతాయని, వివరాలను ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు వెల్లడించారు. గురువారం ఉదయం సుప్రభాతసేన, కాగడహారతి,గురు, దైవ బాబా కు సుగంధద్రవ్యములతో, గోక్షీరముతో, అభిషేకములు, నూతన వస్త్ర, ఆభరణములు అలంకరణ ఏకహం జరుగుతాయి. మధ్యాహ్నం హారతి,సాయంత్రం పల్లకీ మహోత్సవం, సంధ్యాహారతి, రాత్రి భజన కార్యక్రమం అనంతరం బాబా కు శేజ్ హారతి ఇస్తారు. చివరి రోజు శుక్రవారం ఉదయం సుప్రభాతసేవ, కాగడ హారతి,సాయి పూజ కలశపూజ, 12 గంటలకు గురుబాబా వారికి అన్నాభిషేశీ, మధ్యాహ్నం హారతి,భక్తులకు మహా అన్నప్రసాద వితరణ, సాయి సుహృత హోమం, పూర్ణాహుతి రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, సాయి నామ సంకీర్తణ, భజన కార్యక్రమం, నక్షత్ర హారతి, శేజ్ హారతి,పవళింపు సేవ, తీర్థ ప్రసాద వేడుకలు జరుగుతాయి. ముగింపు రోజు శుక్రవారం పెద్ద ఎత్తున అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చి నగదిలి పరిసర ప్రాంత ప్రజలందరూ ఈ వేడుకల్లో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

# ఐఎఫ్ఆర్-మిలాన్‌కు విశాఖ సర్వం సిద్ధం..!

**- పోలీసుకాన్ఫరెన్స్ లో అధికారులతో సీపీ సమీక్ష - నగర భద్రతపై రాజీపడే ప్రసక్తే లేదు..సీపీ శంఖబ్రతబాగ్చి - వందకు పైగా హోటళ్లతో పోలీసు సమన్వయం - విదేశీ అతిథుల వివరాలు 24 గంటల్లో తప్పనిసరి - ప్రతి హోటల్‌లో భద్రతా అధికారి నియామకం - లోహ గుర్తింపు పరికరాలు ,నిఘా కెమెరాలు తప్పనిసరి - సిబ్బందికి పోలీసు నిర్ధారణ లేకపోతే అనుమతి లేదు**







**విశాఖ క్రైం, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** విశాఖ నగరంలో నిర్వహించనున్న అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష, మిలాన్ కార్యక్రమం, నౌకాదళాధిపతుల సమావేశాల నేపథ్యంలో నగర భద్రతను మరింత బలోపేతం చేయాలని నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. ఈ సందర్భంగా నగరంలోని హోటల్ యాజమాన్యాలతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. నగర పోలీసు సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశానికి కమిషనరేట్ పరిధిలోని సుమారు వందకు పైగా హోటళ్ల యాజమాన్యాలు, ప్రతినిధులు హాజరయ్యారు. ఉప పోలీసు కమిషనర్లు, విదేశీయుల నమోదు అధికారులు, ప్రత్యేక శాఖ అధికారులు, సహాయ పోలీసు కమిషనర్లు, వృత్తాధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. రానున్న రోజుల్లో విదేశీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు నగరానికి విచ్చేయనున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత కీలకమని కమిషనర్ పేర్కొన్నారు. నగర ప్రతిష్ఠను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి హోటల్‌లో ఒక భద్రతా అధికారి నియమించి, ఆయా హోటళ్లు పోలీసు మరియు నౌకాదళ అధికారులతో నిరంతర సమన్వయం కలిగి ఉండాలని ఆదేశించారు. విదేశీ అతిథులు వచ్చిన ఇరవై నాలుగు గంటలలోపు వారి వివరాలను సంబంధిత అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. సందర్శకుల వివరాల సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. హోటల్ ప్రవేశ ద్వారాల వద్ద లోహ గుర్తింపు పరికరాలు ఏర్పాటు చేసి అవి సక్రమంగా పనిచేయాలని, హోటల్ ఆవరణమంతా నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి వాటి దృశ్యాలను భద్రపరచాలని సూచించారు. ముఖ్యంగా వాహన నిల్వ ప్రదేశాలు, మార్గదారులు, విశ్రాంతి మండపాల్లో ప్రత్యేక నిఘా ఉండాలని చెప్పారు. విదేశీ ప్రతినిధులకు అందించే ఆహారం, పానీయాల విషయంలో కల్తీకి ఎలాంటి అవకాశం లేకుండా సేకరణ నుంచి వడ్డన వరకు కఠిన తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. నీటిని ప్రతిరోజూ రసాయన పరీక్ష చేయాలని సూచించారు. హోటళ్లలో వైద్య బృందం, అత్యవసర చికిత్స పరికరాలు, రోగుల తరలింపుకు వాహనం సిద్ధంగా ఉంచాలని తెలిపారు. సమీప ఆసుపత్రులతో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అగ్నిమాపక పరికరాలను పరిశీలించి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో అతిథులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు స్పష్టమైన ప్రణాళిక సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. భవన నమూనా చిత్రాలను పోలీసు అధికారులతో పంచుకోవాలని, అత్యవసర బయటపడే మార్గాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. హోటళ్లలో పనిచేసే శాశ్వత, తాత్కాలిక సిబ్బందికి పోలీసు నిర్ధారణ తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. విదేశీ ప్రతినిధులు లేదా ప్రముఖులు బస చేసినప్పుడు వారి భద్రత, గోప్యతకు భంగం కలగకుండా చూడాలని, అనుమతి లేకుండా చిత్రాలు తీయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. నగరాన్ని సురక్షితంగా ఉంచడంలో హోటల్ యాజమాన్యాలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే 79950 95799 నంబరుకు సమాచారమివ్వాలని చెప్పారు.

# పరిశుభ్ర నగర ఖ్యాతికి నివాసిత సంక్షేమ సంఘాలు సహకరించాలి

## – జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రజలకు అందించే సేవలలో నివాసిత సంక్షేమ సంఘాలు పాత్ర కీలకమైనదని, జివిఎంసి కి సహకరిస్తూ ప్రజలకు అందిస్తున్న సేవల్లో భాగస్వామ్యం కావాలని, పరిశుభ్ర నగర ఖ్యాతికి నివాసిత సంక్షేమ సంఘాలు సహకరించాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జివిఎంసి అదనపు కమిషనర్ పి. నల్లనయ్య, ఏపీ పేర్వాస్ ప్రెసిడెంట్ ఉదయ్ శిర్నామే, అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి, పెందుర్తి, గాజువాక, అగనంపూడి, వెస్ట్, నార్త్ జోన్ ల నివాసిత సంక్షేమ సంఘాలతో, జోనల్ కమీషనర్ లతో కలసి జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ మాట్లాడుతూ నివాసిత సంక్షేమ సంఘాల సమస్యలను తెలియపరచాలని కమిషనర్ సంఘాలను కోరగా... ఏపీ పెర్వస్ ప్రెసిడెంట్ ఉదయ్ శిర్నామే మాట్లాడుతూ విశాఖ నగరంలో నివాసిత సంక్షేమ సంఘాలు జోనులవారీగా జోనల్ కోఆర్డినేటర్ లను ఏర్పాటుచేసి ప్రజల సమస్యల పరిష్కార దిశగా జీవీఎంసీ కి సహకరిస్తున్నామన్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ జీవీఎంసీ నివాసిత సంక్షేమ సంఘాలతో నెలకు ఒకసారి జోనల్ కమీషనర్లు సమీక్ష సమావేశం నిర్వహించినట్లయితే కాలనీలలో సమస్యలు పరిష్కారం, ప్రజలకు అందించే సేవలలో జీవీఎంసీ మరింత అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని సూచించారు. అనంతరం నగరంలో పెందుర్తి, గాజువాక, అగనంపూడి, వెస్ట్, నార్త్ జోన్ల పలు నివాసిత సంక్షేమ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఆయా కాలనీలలో రోడ్లు, కాలువలు మరమ్మతులు చేపట్టాలని, పార్కులు, స్మశాన వాటికలు అభివృద్ధి పరచాలని, వీధిలైట్లు, తాగునీరు సమస్యలు పరిష్కరించాలని, కొత్తగా రోడ్లు కాలువలు తాగునీటి పైపైన్లు కల్పించాలని, పశుసంచారాన్ని నియంత్రించాలని, పలుచోట్ల ప్రభుత్వ స్థలాలను ఆక్రమణ గురికాకుండా కాపాడాలని, పార్కులలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, సగంలో ఆగిపోయిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని తదితర మౌలిక వసతులను కల్పిస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. అనంతరం కమిషనర్ స్పందిస్తూ విశాఖ నగర అభివృద్ధి దిశగా ప్రజలకు సేవలు అందించే కార్యక్రమాల్లో భాగంగా జివిఎంసి ప్రధానంగా పారిశుధ్యం, త్రాగునీరు, వీధి దీపాల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలను నిత్యం కల్పిస్తూ, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తామని కమిషనర్ తెలిపారు. విశాఖ నగరం లో 167 పార్కులు వుండగా అందులో పలు పార్కులు నివాసిత సంక్షేమ సంఘాలు నిర్వహణ బాద్యతలు చేపట్టాయని, మిగిలిన పార్కులకు కూడా ఆర్.డబ్లు.ఎ.లు జివిఎంసి ఒప్పందంతో నిర్వహణ బాధ్యతలకు ముందుకు రావాలన్నారు. వాహనాల పార్కింగ్ సమస్య పరిష్కారం దిశగా జివిఎంసి ఆపరేషన్ లంగ్స్ 3.0 ద్వారా నగరంలో సెల్లార్ ఫ్లోర్లలో పార్కింగ్ సదుపాయానికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతుందన్నారు. పార్కులలో, ఖాళీ స్థలాల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నివాసిత సంక్షేమ సంఘాలు కాలనీలలో ఎదుర్కొంటున్న సమస్యలు ఉన్నట్లయితే స్థానిక ప్రజా ప్రతినిధి అయిన కార్పొరేటర్ ద్వారా తెలియపరచవచ్చని, పురమిత్ర యాప్ డౌన్లోడ్ చేసుకున్నట్టయితే వెంటనే సమస్యలను యాప్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని, జివిఎంసి టోల్ ఫ్రీ నెంబర్ 18004250009 ఫోన్ నెంబర్ కు ఫోన్ చేయడం ద్వారా వెంటనే సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. అలాగే ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నేను స్వయంగా వినతులను స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తానని ఆ సౌకర్యాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవచ్చని కమిషనర్ తెలిపారు. 2025 స్వచ్ఛ సర్వేక్షన్ లో కూడా నివాసిత సంక్షేమ సంఘాలు భాగస్వామ్యమై జివిఎంసి కి సహకరిస్తూ విశాఖ నగర సాధనకు, పరిశుభ్ర నగర అభివృద్ధికి సహకారం అందించాలని కమీషనర్ కోరారు. అనంతరం అదనపు కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ 2025 స్వచ్ఛ సర్వేక్షన్ త్వరలో జరగనున్నందున ప్రజలు అందరు విశాఖ ప్రథమ స్థానం సాధనకు సహకరించేలా నివాసిత సంక్షేమ సంఘాలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజా సమస్యలపై జివిఎంసికి తెలియపరచినట్లయితే వెంటనే ఆయా సమస్యలను పరిష్కరిస్తామని, అలాగే కాలనీలలో జివిఎంసి పార్కులను నివాసిత సంక్షేమ సంఘాలు నిర్వహించుకోవడానికి ముందుకు రావాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, జోనర్ కమిషనర్లు బి.హేమవతి, బి.ఆర్.ఎస్.శేషాద్రి, బి.రాము, హెచ్.శంకర రావు, మనీషా త్రిపాటి, సిటీ ప్లానర్ ధనుంజయ్ రెడ్డి, కార్య నిర్వాహక ఇంజనీర్ మురళి కృష్ణ, డిడిహెచ్ ఇంచార్జ్ వాసుకి, ఎస్.ఆర్.యు. ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజామణి తదితరులు పాల్గొన్నారు.

# ఐఆర్ఎస్ అధికారికిలంచం ఇవ్వజూపిన ఇద్దరి ను అదుపులోకి తీసుకున్న సిబిఐ

## – నలంద విద్యా సంస్థ నిర్వాహకుడితో పాటు ఆయన చార్టెర్డ్ అకౌంటెంట్ను అరెస్టు చేసిన సీబీఐ నర్సీపట్నంలో సంచలనం



**నర్సీపట్నం, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** ఆదాయపన్ను శాఖలో ఐఆర్ఎస్ హోదా కలిగిన ఒక ఉన్నతాధికారికి లంచం ఇచ్చేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తుల్ని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన ఒక విద్యా సంస్థ నిర్వాహకుడు రాజేష్ ఆయన ఆర్థిక వ్యవహారాలు చూసే చార్టెడ్ అకౌంటెంట్ (సీఏ) శరత్ కుమార్ ను సీబీఐ వలకు చిక్కడం స్థానికంగా సంచలనమైంది. వాస్తవానికి వారి కాల్ రికార్డులపై కన్నేసి మరీ సీబీఐ పట్టుకోవడం గమనార్హం. నర్సీపట్నానికి చెందిన ప్రముఖ నలంద విద్యా సంస్థల అధినేత నేరెళ్ల వెంకట రాజేష్ పాటు ఆయన చార్టెర్డ్ అకౌంటెంట్ (సీఏ) శరత్ కుమార్ ఈ నెల 5న సీబీఐ అధికారులు అరెస్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజేష్ నర్సీపట్నంలో నలంద విద్యాసంస్థలు . వాటర్ ప్లాంట్ . రియల్ ఎస్టేట్ రంగంలోనూ. వైన్ డీలర్ గా వ్యవహరిస్తూ తప్పుడు వ్యాపారాలు నిర్వహించడం జరుగుతుందని పలువురు తెలియజేస్తున్నారు. సరైన ఎకౌంటు లు మెయింటెన్ చేయకుండా ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు చూపిస్తాడని తెలుస్తుంది. నర్సీపట్నంలో చాలామంది వ్యాపారస్తులు ఇలాంటి వ్యవహారాలే నడుపుతూ చలామణి అవుతున్నారని వారి పైన కూడా సిబిఐ దర్యాప్తు చేస్తే కల్తీ వ్యాపారం చేసే వాళ్ళందరూ కూడా దొరుకుతారని పలువురు అంటున్నారు.

# తాణం ప్రభుత్వ గురుకుల కళాశాలలో రసాయన ప్రయోగశాలను ప్రారంభించిన విశాఖ ఫార్మసిటీ ఎండి డా”పిపి లాల్ కృష్ణ



**పరవాడ, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** రాంకీ ఫౌండేషన్ మరియు ఫౌండేషన్ ఫర్ రీజెలయన్స్ సహకారంతో తానం ఎం జె పి ఎ పి బి సి డబ్ల్యు ఆర్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ (బాలికలు) హాస్టల్ నందు ఆధునికరించిన ఫిజిక్స్ ల్యాబ్ మరియు నూతనంగా నిర్మించిన బయాలజీ ల్యాబ్ లను విశాఖ ఫార్మాసిటీ ఎండి డా” పి.పి లాల్ కృష్ణ ,ఎఫ్ ఎఫ్ ఆర్ డైరెక్టర్ సామ్రాట్ కుమార్ బసక్ బుధవారం ముఖ్య అతిథులుగా పాల్గొని సంయుక్తంగా ప్రారంభించారు . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ పి.పి లాల్ కృష్ణ మాట్లాడుతూ సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన సముదాయాలను సక్రమంగా నిర్వహిస్తూ దీర్ఘకాలికంగా ఉంచవలసిన బాధ్యత సిబ్బంది మరియు కమిటీ సభ్యులదే అన్నారు. అనంతరం డైరెక్టర్ సామ్రాట్ కుమార్ బసక్ మాట్లాడుతూ సుమారు 780 మంది బాలికలు చదువుతున్న ఈ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ను నిర్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం మీదనే కాకుండా ప్రయోగాలపై కూడా ప్రావీణ్యం సంపాదించినప్పుడే వారి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని తెలిపారు . అభ్యర్థన మేరకు సైన్స్ ల్యాబ్ లను మంజూరు చేసిన రాంకీ మరియు ఎఫ్ శ్రీఎఫ్ఆర్ సంస్థలకు ప్రిన్సిపల్ రమామోహిని ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాథ రావు, విద్యా కమిటీ అధ్యక్షులు, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డా “శ్రీకాంత్ , రామ్ కి ఫౌండేషన్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే లడ్డూ వివాదం

## – కల్తీ జరగలేదని సిబిఐ సిట్ నివేదిక చెప్పినా పదే పదే విమర్శలు తగదు – మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు విమర్శ



**దేవరాపల్లి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** సంక్షేమం, అభివృద్ధి చేపట్టడంలో ఘోరంగా విఫలమైన కూటమి ప్రభుత్వం వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే తిరుమల లడ్డూ వివాదాన్ని తెరపైకి తీసుకువచ్చిందని మాజీ డిప్యూటీ సిఎం, వైఎస్సార్సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. దేవరాపల్లి మండలం తారువలో బుధవారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. స్వార్థ రాజకీయాల కోసం శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను తగ్గించేలా వ్యవహరించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. సిబిఐ ఆధ్వర్యంలోని సిట్ నివేదిక శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యిలో జంతు కొవ్వు కలవ లేదని స్పష్టం చేసినప్పటికీ పదే పదే విష ప్రచారం చేయడంపై ఆయన మండిపడ్డారు. మొన్నటి వరకు జంతు కొవ్వు కలిసిందని, ఇప్పుడేమో ఏకంగా బాత్రూమ్లు కడిగే హార్పిక్స్ తయారీకి వినియోగించే కెమికల్స్ కలిపారని దుష్ప్రచారం చేయడం అత్యంత దుర్మార్గమన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్రెడ్డిపై నెపం నెట్టాలనే దుర్బుద్ధితోనే నీచ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బాధ్యతాయుత స్థానాలలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అసత్య ప్రచారాలు చేస్తూ కోట్లాది మంది భక్తుల మనోభావాలతో చెలగాటం ఆడటం సరికాదని హితవు పలికారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పవిత్రతను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సహా కూటమి నేతలంతా శ్రీవారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా దేవుడితో రాజకీయాలు చేయడం మానుకొని పరిపాలనపై దృష్టి సారించాలని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్ష నేతల ఇళ్లపై దాడి చేసే విష సంస్కృతిని విడనాడాలని మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు సూచించారు.

# ప్రతి మహిళ అక్షరాశులుగా తయారవ్వాలి

## – ఎంపీడీవో ఎం ఉషారాణి



**మునగపాక, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** మండలంలో ఉమ్మలాడ గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు బుధవారం సాయంత్రం 7:30 గంటలకు అక్షరాంధ్రా వయట్సజన విద్య అందిస్తున్న కార్యక్రమం లో భాగాంగా ఎంపీడీవో ఎం ఉషారాణి, డిప్యూటీ ఎంపీడీవో ఎం సోమరాజు, ఏపీఎం ఎం బాలరాజు, ఉమ్మలాడ గ్రామాన్ని సందర్శించారు , కావున ప్రతి మహిళా అక్షరాస్యులు గా తయారు చెయ్యాలని కలక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాలు ప్రకారం అందరికి చదవడం రాయడం సంతకాలు నేర్పించాలని వాలంటరీ టీచర్ లకు సూచనలు చేశారు, ఈ నెల చివరి వారంలో మట్నదటి పరీక్ష ఉంటుందని అలాగే మార్చి చివరి వారంలో మెయిన్ పరీక్ష రాయడానికి అందరికి సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో ఎం ఉదయశ్రీ తెలియజేశారు.

## సచివాలయ పోలీసులకు అవగాహన కార్యక్రమం..



**నరసన్నపేట, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** నరసన్నపేట మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు, సబ్ ఇన్స్పెక్టర్ బి. గణేష్ బుధవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామీణ ప్రాంతాలలో దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా చర్చించడం జరిగింది. రాబోయే పండుగల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలోని దేవాలయాలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం, హుండీలను తరచూ ఖాళీ చేయించడం, అలాగే ఇతర భద్రతా చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో గ్రామ ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలియజేయడం జరిగింది. అలాగే పాఠశాలల్లో పిల్లలకు గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వారి భద్రతపై చైతన్యం కల్పించాలని నిర్ణయించారు. ఈ సమావేశం ద్వారా మహిళలు, పిల్లలు, ప్రజల భద్రత కోసం నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, నేరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, సి. ఐ,ఎం. శ్రీనివాసరావు, ఎస్సై బి. గణేష్ సూచించారు.

## పండిట్ దీన్ దయాల్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి

**- బిజెపి మండల అధ్యక్షులు జర్జన రాంజీ**



**టెక్కలి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** 11ప్రతి ఒక్కరూ పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షులు మరియు కోటబొమ్మాలి మార్కెట్ డైరెక్టర్ జర్జన రాంజీ అన్నారు. మండలంలోని స్థానిక బిజెపి కార్యాలయంలో బుధవారం పండిట్ దీన్ దయాల్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు అందరూ కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధికి ఆయన అందించిన ఆలోచనలు మరియు సిద్ధాంతాలను ఎన్నటికీ మరవలేనివని అన్నారు. ఆయన చేసిన సేవలను అనుక్షణం గుర్తుంచుకొని ప్రతి ఒక్కరు ముందుకు అడుగులు కొనసాగించాలని తెలిపారు. సమాజంలో చివర వ్యక్తి అభివృద్ధి అసలైన అభివృద్ధి అనే ఉపాధ్యాయుల సిద్ధాంతాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. యువతలో జాతీయ చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వర రావు, స్టేట్ కౌన్సిల్ నెంబర్ జన్ని పరమేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు నడుపురి లక్ష్మీనారాయణ, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి గోపాల కామేశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆకులు ప్రకాష్, పిట్ట రామ్మోహన్రావు, పోతూజు నాగేంద్ర, సంపత్ రావు రమేష్, సోషల్ మీడియా ఆర్ వెంకటరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతిరుమల వెంకటేశ్వరస్వామిని వదల్లేదు



**ఆమదాలవలస, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వం తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామిని తమ రాజకీయాలకు వాడుకుంటున్నారని వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చింతాడ రవికుమార్ విమర్శించారు. ఆమదాలవలసలో వైఎస్సార్సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో తిరుమల లడ్డుపై కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రచారం అంతా ఇంత కాదని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తు అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు కూటమి ప్రభుత్వ నాయకులను మందలించిన వారి తీరు మారలేదని ఎద్దేవ చేశారు. తిరుమలలో లడ్డులో రసాయనాలతో పాటు ఇతరత్రా అనేక మిశ్రమాలతో కూడిన నెయ్యి సరఫరా చేశారని ఆరోపణలు వినిపిస్తున్న సమయంలో సుప్రీంకోర్టు నాణ్యత పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాల ఇచ్చిన ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను దృష్టి మరలచడానికే కూటమి నాయకులు తిరుపతి లడ్డు వ్యవహారాన్ని చంద్రబాబునాయుడు తెరపైకి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పథకం ప్రకారమే ఈ లడ్డు వ్యవహారం నడుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మీది ఉంది కాబట్టి తిరుమలలో లడ్డుపై సిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి పాలన అరాచక సాగుతుందని, ఇచ్చిన హామీలను మరిచి ప్రజల దృష్టిని మరల్చుడానికే ఈ కుట్రపాలనకు తెరపైకి డ్రామా సాగిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరు నిందితులకు పదివేల రూపాయల చొప్పున జరిమానా విధించిన టెక్కలి కోర్టు




**టెక్కలి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు టెక్కలి జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించింది. టెక్కలి టౌన్‌లోని చేరి వీధికి చెందిన పోతల ఈశ్వరరావు మరియు రావివలస గ్రామానికి చెందిన దాసరి రాజేష్‌లు మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని బుధవారం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ యు.మాధురి ఎదుట హాజరుపరచగా,విచారణ అనంతరం ఒక్కొక్కరికి రూ.10,000/- (పదివేల రూపాయలు) చొప్పున జరిమానా విధించారు. ఈ విషయాన్ని టెక్కలి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏ. విజయ్ కుమార్ తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తరచూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపకుండా జాగ్రత్తలు పాటించి, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని పోలీసు అధికారులు సూచించారు.

## ఈ నెల 14న సాధారణ సర్వ సభ్య సమావేశం

**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** ఈ నెల 14న మండల మండల పరిషత్ అధ్యక్షులు రోణంకి ఉమా మల్లేశ్వర రావు ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించబడునని ఎంపీడీవో కే. ఫణీంద్ర కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు ఎంపీటీసీలు, సభ్యులందరూ హాజరవ్వాలని ఆయన కోరారు.

## కారు ఢీకొని వృద్ధురాలు మృతి...



**నరసన్నపేట, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** నరసన్నపేట మండలం జమ్ము జంక్షన్ వద్ద బుధవారం ఉదయం కారు ఢీకొని పాతపట్నం మండలం తిడ్డిమి గ్రామానికి చెందిన దువ్వారి జానకమ్మ(60) మృతి చెందింది. తన సొంత గ్రామం నుండి శ్రీకూర్మం ఆటోలో వెళుతుండగా బుధవారం, ఉదయం 5.15 గంటల సమయంలో నరసన్నపేట మండలం జమ్ము గ్రామం దగ్గర కాలకృత్యాల నిమిత్తం రోడ్ ప్రక్కన ఆటో నిలిపి, కాలకృత్యాలూ ముగించుకొని రోడ్డు దాటుచుండగా, చల్లవానిపేట వైపు నుండి నరసన్నపేట వైపు వస్తున్న కారు ఏూ 39ఇశ 7307 జానకమ్మ ను బలంగా గుద్దడం వలన సంఘటన స్థలం వద్దనే మరణించినట్లు కుమార్తె గుంపు శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్సై బి. గణేశ్ , కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



**మెలియాపుట్టి, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** ప్రతి రైతు ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ (ఏపీఎస్ఆర్ ఐడీ) పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్ దాన కర్ణుడు కోరారు. బుధవారం మెలియాపుట్టి మండలంలో కోసమాల ,వసుంధర గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. మొక్కజొన్న ,వరి, వేరుశనగ ,అపరాల పంటలు పండించే రైతులు యాజమాన్య పద్ధతులతో పంటలు పండిస్తే అధిక దిగుబడులు సాధించాలన్నారు. చీడపురుగుల నివారణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని కోరారు.కేంద్ర,, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎంకిసాన్, పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీ, ఈ-పంట నమోదు, విత్తనాలు, ఎరువులు వం టివి రాయితీపై ఒకే ఐడీ ద్వారా పొందేందుకు అవకాశం ఉందన్నారు. రైతులంతా పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తో సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు క్రాంతి, జరిత, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఆసుపత్రులు పటిష్టతకు సహకరించాలి

**- ఐఏఎస్ గోపాలకృష్ణతో పలాస ఎమ్మెల్యే శిరీష భేటీ**



**పలాస, ఫిబ్రవరి 11, మేజర్‌న్యూస్:** పలాస నియోజకవర్గంలోని పి.హెచ్.సి, సి.హెచ్.సి ల్లోని పలు సమస్యలను ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రెటరీ రోణంకి గోపాలకృష్ణ దృష్టికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తీసుకెళ్లారు.సచివాలయంలోని ఆయన కార్యాలయంలో బుధవారం పలాస ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ప్రభుత్వ వైద్యాశాలలను మరింత పటిష్టం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆయన సానుకూలంగా స్పందించి, పలాస నియోజకవర్గంలోని ఆస్పత్రుల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా ఐఏఎస్ రోణంకి గోపాలకృష్ణ స్వస్థలం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పారసంబ కావడం గమనార్హం.